



అన్నదాత సుఖీభవ.. జాబితా సిద్ధం

ఏలూరుసిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం అమలుకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన జాబితాను గ్రామ స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వ్యవసాయ శాఖాధికారులు అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లాలో 1,63,383 మంది సొంత భూములు కలిగిన రైతులను అర్హులుగా గుర్తించారు. వీరిలో 1,58,318 మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 4,189 మంది రైతులను అనర్హులుగా తేల్చారు. కాని వారి నుంచి అర్జీలను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా వ్యవసాయ శాఖ అనర్హులుగా గుర్తించి వారి నుంచి అర్జీలు స్వీకరిస్తోంది.మిగిలిన వారిలో ఇంకా 859 మందికి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకంలో రూ. ఆరు వేలు, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.14 వేలు రైతులకు అందనున్నాయి. ఇవి మూడు విడతలుగా అందజేస్తారని తెలుస్తోంది. అనర్హులుగా పేర్కొ న్న రైతులలో మ్యుటేషన్లు పూర్తి చేయని రైతులు, ఈనాం భూములు, ఆధార్ సీడింగ్ చేయించుకోని, ఆధార్‌లో తప్పులు ఉన్నవారు, వాటిని సరిజేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. వాటిని పరిశీలిం చిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉన్నవారిని తిరిగి అర్హులుగా గుర్తిస్తారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అర్హుల పేర్లను పంపేలా వ్యవసాయ శాఖ లాగిన్‌లో అవకాశం కల్పించింది. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో అనర్హులుగా గుర్తించిన రైతుల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం అర్హుల జాబితాలోకి చేర్చుతారు. దీంతో ఇప్పుడు ప్రకటించిన అర్హుల జాబితాలో రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

చింతలపూడిలో అత్యధికం

జిల్లాలో మండలాల వారీగా అర్హులైన జాబితాను పరిశీలిస్తే చింతలపూడి మండలంలో అత్యధికంగా 12,924 మంది రైతులు ఉన్నారు. అత్యల్పంగా వేలేరు పాడు మండలంలో 511 మంది ఉన్నారు. ఆగిరిపల్లి 10,244, ద్వారకాతిరుమల 10,016, జీలుగు మిల్లిలో 3,343, నూజివీడు 9,135, దెందులూరు 5,929, కామవరపు కోట 8,242, ముసునూరు 8,313, చాట్రాయి 8,330, భీమడోలు 3,603, పెదవేగి 9,643, పెదపాడు 4,797, టి.నరసాపురం 9,284, లింగపాలెం 8,387, ఉంగుటూరు 8,265, నిడమర్రు 2,234, మండవల్లి 2,015, ముదినేపల్లి 4,958, జంగారెడ్డిగూడెం 8,370, కొయ్యలగూడెం 8,470, కైకలూరు 1,222, ఏలూరు రూరల్ 1,170, పోలవరం 5,108, బుట్టాయిగూడెం 6,245, ఏలూరు అర్బన్ 1,043, కలిదిండి 759, కుక్కునూరులో 823 మంది రైతులను అర్హులుగా గుర్తించారు.

త్వరలో కౌలు రైతుల జాబితా

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి త్వరలో కౌలు రైతుల జాబితా కసరత్తు చేయనున్నారు. సీసీఆర్‌సీ కార్డుల ప్రక్రియ పూర్తి కాగానే ఈ జాబితా పూర్తయ్యే అవకాశాలున్నాయి. వారికి కూడా అన్నదాత సుఖీభవ కింద సాయం అందిస్తారని చెబుతున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో కలిపి రూ.13,500 మాత్రమే అందించగా ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రూ.20 వేలు అందించనుంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం కొంత మంది రైతులకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. సకాలంలో సొమ్ములు అందజేయక పోవడంతో సాగు ఖర్చులకు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేయూతగా ఉండడానికి సాగు సమయంలోనే ఈ పథకం సొమ్ములను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.

ఆడుదాం-ఆంధ్రాపై విజిలెన్స్ ఆరా

- పంచాయతీలు, వార్డు సచివాలయాల వారీగా వివరాల సేకరణ
- అక్రమార్కుల్లో అలజడి

ఏలూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆడుదాం-ఆంధ్రాలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబరులో నిర్వహించిన ఈ ఆటల పోటీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. నాలుగేళ్ల క్రీడలను గాలికొదిలేసిన గత ప్రభుత్వం ఎన్నికల ముందు 'ఆడుదాం ఆంధ్రా' అంటూ నిధులు దోచేసే ఎత్తు వేసింది. క్రీడలంటే తెలియని వారికి సైతం పోటీలు నిర్వహించడం గమనార్హం. వీటిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సైతం పాల్గొన్నారు. క్రీడల సందర్భంగా తాగునీరు కూడా ఇవ్వలేదు. కాని ఏకంగా భోజనాలే పెట్టినట్టు బిల్లులు పెట్టారు. క్రీడా కిట్లు నాణ్యత గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. నాసిరకమైన వాటిని సరఫరా చేశారు. సీఎం జగన్ బొమ్మలతో నాసిరకంగా స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు అందజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించినా అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగాయి. ఇలా అడుగడుగునా అక్రమాలకు పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు నిధులు పక్క దారి పట్టినట్టు తెలుస్తోంది. ఈ అవినీతిపై టీడీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆ మేరకు విజిలెన్స్ అధికారులు గత నెల రోజులుగా విచారణ చేపట్టారు. అసలు ఏ ఏ క్రీడలు నిర్వహించారు ? ఎంత మంది క్రీడాకారులు పాల్గొన్నారు ? వారికి ఎటువంటి సదుపాయాలు కల్పించారు ? ఆహారం, మంచి నీరు, బహుమతుల కోసం ఎంత ఖర్చు చేశా రు. బ్యాంకుల నుంచి విత్‌ డ్రా చేసిన సొమ్ము ఎంత ? మిగిలిన బ్యాలెన్స్ ఎంత ? ఆ సొమ్ము ఏం చేశారు ? వంటి వివరాలను మునిసిపాల్టీల వారీగా కమిషనర్లు, పంచాయతీలో అధికా రుల నుంచి సేకరిస్తున్నారు. దీంతో అవకతవక లకు పాల్పడిన వారు.. ఏం చెప్పాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నట్టు చెబుతున్నారు.

రేషన్ బియ్యం.. మాఫియా!



నూజివీడు నియోజకవర్గంలో జోరుగా అక్రమ రవాణా

నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వంలో విచ్చల విడిగా సాగిన రేషన్ బియ్యం దందా టీడీపీ ప్రభుత్వంలోను యథావిధిగానే సాగుతుండడం విశేషం.

- ఈనెలలో ఇప్పటికే రెండుసార్లు పట్టివేత
- ప్రభుత్వం మారినా ఆగని దందా

నూజివీడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణ యథేచ్ఛగా సాగుతోంది. ఏ ప్రభుత్వం ఉన్నా ఈ బియ్యం అక్రమ రవాణాలో ప్రధాన పాత్రధారులు మాత్రం మారరు. పోలీస్, రెవెన్యూ, అధికార పార్టీకి చెందిన నేతల సహకారంతో గత ఆరేళ్ల నుంచి ఈ బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. ఈ నెలలో ఇప్పటికే రెండుసార్లు నూజివీడు నియోజకర్గంలో రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈనెల మూడో తేదీన నూజివీడు బైపాస్ రోడ్‌లో ఐదు టన్నుల బియ్యాన్ని పట్టుకోగా, తాజాగా 26 క్వింటాళ్ల బియ్యం మర్రిపూడిలో పట్టుబడింది. ఈ బియ్యం అధికారుల తనిఖీల్లో కాకుండా గ్రామస్థులే పట్టించడం గమనార్హం.

పక్కాగా బియ్యం సేకరణ

రేషన్ బియ్యం అర్హత ఉన్న లబ్ధిదారుల నుంచి కొందరు రేషన్‌షాప్ డీలర్లే కేజీ రూ.12 నుంచి రూ.15 వరకు డిమాండ్‌ను బట్టి కొంటున్నారు. డీలర్ దగ్గర నుంచి రూ.15 నుంచి రూ.18 చెల్లించి దళారి కొనుగోలు చేస్తాడు. ఆగిరిపల్లి నూజివీడు ముసునూరు చాట్రాయి మండలాల నుంచి ఈ బియ్యం కొనుగోలును మండలానికి ఒకరు చొప్పున నలుగురు పర్యవేక్షిస్తున్నారు. వీరి వద్ద నుంచి పీఆర్ అన వ్యక్తి రూ.20 నుంచి రూ.22లకు కొనుగోలు చేస్తాడు. ఇతను గన్నవరం,తిరువూరు, మైలవరం నియోజవర్గాల నుంచి భారీగా ఈ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి హనుమాన్ జంక్షన్ వద్ద జాతీయ రహదారికి అతి చేరువలో ఉన్న ఒక గ్రామంలో రైస్ మిల్లు లీజుకు తీసుకుని స్టాక్ పాయింట్‌గా ఉపయోగిస్తున్నాడని ప్రచారంలో ఉంది.

డీలర్లకు సైతం వేధింపులే..

కోళ్లఫారాల యజమానులు వారి అవసరార్థం రేషన్ షాప్ డీలర్ నుంచి ఈ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. దళారుల కన్నా రెండు రూపాయల వరకు ఎక్కువ ధర ఇచ్చి కొంటుంటారు. అయితే డీలర్లు రేషన్ బియ్యాన్ని తమకే అమ్మాలని, విరుద్ధంగా జరిగితే మీపై ప్రభుత్వ అధికారులతో దాడులు చేయిస్తామని బెదిరింపులకు దిగడంతో దళారులకే బియ్యాన్ని అమ్ముతున్నట్టు ప్రచారంలో ఉంది. గ్రామాల్లో రిక్షాలపై ఉప్పు లేదా ఉల్లిపాయలు వంటి సరుకులను బియ్యం మారకంతో అమ్ముకునే చిల్లర వ్యాపారులను సైతం రేషన్ బియ్యం దళారులు వదలడం లేదు. ఆ బియ్యాన్ని సైతం తమకే ఇవ్వాలని బెదిరించి మరి తీసుకుంటున్నారని తెలుస్తోంది. అన్ని రకాలుగా సేకరించిన బియ్యాన్ని స్టాక్ పాయింట్ వద్దకు చేరుస్తారు. అక్కడి నుంచి పెద్ద లారీల్లో బియ్యం లోడ్ అయ్యి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతీ లారీ ముందు ఒక కారులో ఇద్దరు వ్యక్తులు మార్గమధ్యలో అవసరమైన చోట సొమ్ములు చెల్లించుకుంటూ పోర్టు వరకు ఎస్కార్ట్‌గా వెళ్లతారు.

26 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నూజివీడు మండలం మర్రిపూడిలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలోని రేషన్ షాపు నుంచి మినిలారీలోకి రేషన్ బియ్యాన్ని అక్రమంగా లోడ్ చేస్తుండగా, చుట్టుపక్కల గ్రామస్థులు బియ్యం, అక్రమ రవాణాను అడ్డుకున్నారు. పోలీసులకు రెవెన్యూశాఖకు సమాచారం అందించడంతో, అధికారులు వచ్చి లారీకి సీజ్ చేసి శనివారం ఉదయం నూజివీడు పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. డీలర్ అచ్చయ్య బత్తులవారిగూడెంకు చెందిన సొంగ రాముపై కేసు నమోదు చేసినట్టు నూజివీడు డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

పట్టుబడిన బియ్యం లెక్కలేమిటి..!

రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన రేషన్ బియ్యం లెక్కలు తీస్తే మరో స్కాం బయటపడుతుందని ప్రచారం ఉంది. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సమీపంలోని రైస్ మిల్లులుకు తరలిస్తారు. కాగా ప్రభుత్వం దృష్టి సారించి వివిధ రైస్ మిల్లులు వద్దకు చేరిన ఈ సదరు బియ్యాన్ని ఎన్ని టన్నులు వినియోగించబడింది..? ఎన్ని టన్నులు పురుగులు పట్టి పనికి రాకుండా పోయింది..? లెక్కలు తీస్తే మరో స్కాం బయట పడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రేమ..పెళ్లి ..దాడి
పంచాయితీకొచ్చిన గ్రామ పెద్దలపై అటాక్

రాజీయే రాజమార్గం
ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

■ లోపలి పేజీలో..



చేగొండపల్లి ఆశ్రమ గిరిజన పాఠశాలలో వైద్య శిబిరం

చేగొండపల్లి ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

పోలవరం, జూలై 5 :చేగొండపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు శనివారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్తపరీక్షలు, వైద్య చికిత్సలు అందజేశారు. 'హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం రావడంతో స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆశ్రమ పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించగా ఎనిమిది మంది విద్యార్థులకు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ ప్రసాద్ తెలిపారు. వారికి వైద్య చికిత్సలు అందజేయగా ఐదుగురు డిశ్చార్జ్ అయ్యారని మరో ముగ్గురు కోలుకుంటున్నారని తెలిపారు. ఎల్ఎన్‌డీపేట వైద్యాధికారితో కలిసి గ్రామంలో పూర్తి శానిటేషన్ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్ బాబు, ఈవోపీఆర్డీ రాజారావు శానిటేషన్ కార్యక్రమాల్ని స్వయంగా పర్యవేక్షించారు.



సభలో ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

పేదల కోసం పోరాడేది ఎర్ర జెండాయే..

- దేశాన్ని కాపాడుకోవడానికి అన్ని పక్షాలు ఏకం కావాలి
- చింతలపూడి బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

చింతలపూడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : 'సమస్యల పరిష్కారానికి పోరాడేది, పేదల కోసం పోరాడేది ఎర్ర జెండాయే. దేశాన్ని కాపాడుకోవడానికి కమ్యూనిస్టులు, లౌకిక పార్టీలు, వామపక్ష ప్రజాతంత్ర పార్టీలు ఏకం కావాలి..ఈ మేరకు సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా పిలుపు ఇవ్వనున్నాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. చింతలపూడిలో శనివారం జరిగిన సీపీఐ జిల్లా బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'మోదీ మీడియాను చేతుల్లో పెట్టుకుని భారతదేశం ప్రపంచంలో నాల్గవ స్థానానికి ఎదిగిందని ప్రచారం జరుపుకుంటున్నారు. గత జగన్ పాలన పిచ్చివాడి చేతిలో రాయిగా సాగింది. ప్రతిపక్షాలకు ఇంటి దగ్గరగాని, కార్యాలయంలో గాని కలిసే అవకాశం ఇవ్వలేదు. ఏ ప్రాజెక్టు కట్టలేదు. బస్సు యాత్ర జరిగినప్పుడు ప్రకాశం జిల్లాలో బండ్లకమ్మ ప్రాజెక్టుకు గేటు ఊడిపోతే పెట్టమన్నా పెట్టలేదు. ఇక ఏడాది చంద్రబాబు పాలనలో ఆయన రివర్స్‌లో ఉన్నారు. ఏడాది ఉత్సవాలు జరుపుకుంటున్నారు.. సమస్యలు యథావిధిగా ఉన్నాయి. ఏడాది పాలనలో లక్ష కోట్లు అప్పు చేశారు. జగన్ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టమని ప్రతిపక్ష నేతగా చెప్పిన చంద్రబాబు ఇప్పుడు స్మార్ట్ మీటర్ బిగిస్తే అభ్యంతరం చెప్పిన వినియోగదారులపై కేసులు పెడుతున్నారు. ఇదేం న్యాయం. పోలవరం పనులను ప్రతీ సోమవారం పర్యవేక్షిస్తామన్న ఆయన ఇప్పుడు ఆ సోమవారం ఏదీ కనిపించడం లేదు. కేంద్రం, రాష్ట్రంలోనూ ఎన్‌డీపే ప్రభుత్వమేనని, ఇది డబుల్ ఇంజన్ పార్టీ అని పవన్‌కల్యాణ్ చెబుతున్నారు. ఏం అభివృద్ధి జరిగింది. విద్యుత్ చార్జీలు పెంచుతున్నా ఎందుకు ప్రశ్నించరు. వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర పార్టీలు, లౌకిక పార్టీలు ఏకమయ్యే రోజు రావాలి. ఇందులో భాగమే ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపు' అని ఆయన పేర్కొన్నారు. ముందుగా ఆయన పార్టీ కార్యాలయం వద్ద సీపీఐ జెండాను ఎగురవేశారు. సభలో సీపీఐ నాయకుడు మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, చలసాని రామారావు, బండి వెంకటేశ్వరరావు, ఎం.వసంత రావు, కె.వెంకట్రావు, ఎం.డి.మునీర్, ప్రజానాట్య మండలి ఆర్.పిచ్చియ్య, హేమశంకర్, కంచర్ల గురవయ్య, టి.బాబు తదితరులు పాల్గొన్నారు. సభకు సీపీఐ అభిమానులు భారీగా తరలివచ్చారు. ముందుగా ప్రజానాట్య మండలి పట్టణంలో భారీ ర్యాలీ జరిపింది.



వాణిజ్య పన్నులశాఖ డీసీ, జేసీలు బదిలీలు

- నూతన అధికారులుగా శైలజాశ్రీ,నాగార్జునరావు

ఏలూరు,జూలై 5(ఆంధ్రజ్యోతి):జిల్లాలో వాణిజ్య పన్నులశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డి.రాంబాబు విజయవాడ-3 డీసీగా, జాయింట్ కమిషనర్ పనిచేస్తున్న పి.రమాకోటేశ్వరరావు విజయనగరం జాయింట్ కమిషనర్లుగా బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో నూతనంగా డీసీగా విజయవాడ-3 డీసీగా పనిచేస్తున్న కంసాల పుత్తూరు శైలజాశ్రీ, జాయింట్ కమిషనర్‌గా విజయనగరంలో పనిచేస్తున్న బి.నాగార్జునరావు నియమితుల య్యారు. త్వరలో వీరిద్దరూ బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం బాధ్యతల స్వీకరణ

జిల్లా రోడ్లు,భవనాలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా కె.విజయరత్నం శనివారం ఏలూరు కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన పి.భరతరత్నం గత నెలాఖరును ఉద్యోగ విరమణ చేశారు. విజయవాడ ఎన్‌హెచ్ విభాగంలో ఎస్ఈగా పనిచేస్తూ ఇటీవల బదిలీల్లో విజయరత్నం నియమితులయ్యారు. నూతన ఎస్ఈను ఏలూరు ఈఈ కిషోర్ బాపూజీ,డీఈ,ఏఈ కలసి అభినందనలు తెలిపారు.

రేపు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)సేవలను ఈనెల 7న సోమవారం మండల, డివిజనల్, మున్సిపాల్ స్థాయిలతో పాటు, ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి నుంచి ఆన్‌లైన్ ద్వారా హెచ్‌టీటీపీ://మీకోసం.ఏపీ.జీవో.ఇన్‌కు ఫిర్యాదు పంపవచ్చన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో వర్షం కురిసిన మండలాల్లో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కలిదిండి 11.6, మండవల్లి 11.4, ఆగిరిపల్లిలో 9.4, పెదపాడు 6.4, ఏలూరు అర్బన్ 4.2, నిడమర్రు 4, ఏలూరు రూరల్ 2.6, కైకలూరు 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 1.9 మిల్లీ మీటర్లుగా నమోదైంది.

విద్యార్థి వృద్ధి కోసమే మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్



- కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి సామర్థ్యాల పురోగతి, ప్రవర్తన, ఆరోగ్య విషయాలపై పరస్పరం చర్చించుకుని సమగ్ర వృద్ధిని సాధించేందుకు ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి వెల్లడించారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమ ఏర్పాట్ల వివరాలను తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,368 ప్రభుత్వ, ప్రైవేటు పాఠ శాలలు, 140 జూనియర్ కళాశాలల్లో నిర్వహించే పీటీఎం కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు విద్యాశాఖేతర అధికారులను థర్డ్‌పార్టీ నోడల్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యావేత్తలు, మేధావులు, పూర్వపు విద్యార్థులు, ఇతరులు మెగా పీటీఎంకు హాజరయ్యేందుకు వీలుగా ఆహ్వానాలను టీచర్లతో పంపించినట్టు తెలిపారు. విద్యార్థుల పురోగతే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం ఉంటుందన్నారు. జిల్లాలో వినూత్నంగా విద్యార్థుల తల్లులను ప్రధాన వేదిక పైకి ఆహ్వానించి వారి పిల్లలతో పూలతో పాదాభివందనం చేయించడం, మొత్తం 1,64,170మంది విద్యార్థులు తమ తల్లుల పేరిట స్కూలు/కళాశాల ఆవరణలో ఒక మొక్క చొప్పున నాటించి, వాటిని మూడేళ్లపాటు పరి రక్షణ బాధ్యతలు తీసుకునేలా బాలబాలికలకు గ్రీన్ పాస్‌పోర్ట్‌లను అందజేయనున్నట్టు వెల్లడించారు. పేరెంట్స్‌కు ఆటపాటలు, విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చడం, చివర్లో సహపంక్తి భోజనం చేయడం ద్వారా పండుగ వాతావరణంలో పీటీఎం 2.0ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, సమగ్రశిక్ష సీఎంవో రవీంద్ర, విలీనవిద్య జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కరరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఇక ప్రభుత్వ పాఠశాలలకు.. ఉచిత విద్యుత్ !

- తీరనున్న హెచ్ఎంల వెతలు
- జిల్లాలో 1744 ప్రభుత్వ పాఠశాలలు

ఏలూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఏళ్ల తరబడి నిధులకోసం ఎదురు చూస్తున్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తీపికబురు. ఇక మీదట విద్యుత్ బిల్లులకోసం ప్రభుత్వమిచ్చే నిధుల కోసం ఎదురుచూడడం, ఈలోగా సొంత జేబు నుంచి బిల్లులను చెల్లించే అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్‌ను ఇచ్చే దిశగా కార్యాచరణ ప్రారంభమైంది.

వివరాల సేకరణ పూర్తి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథ మికోన్నత, ఉన్నత పాఠశాలల (ఎయిడెడ్ మినహా)కు ప్రస్తుతం వున్న విద్యుత్ కనెక్షన్లు, మీటర్ల నంబర్లు, తదితర వివరాలను సేకరించే పనిని జిల్లా విద్యాశాఖ దాదాపు పూర్తిచేసింది. జిల్లాలో మొత్తం 2,233 పాఠశాలలు న్నాయి. వీటిలో 1,744 ప్రభుత్వ, 20 ఎయిడెడ్, 469 ప్రైవేటు అన్‌ఎయి డెడ్ పాఠశాలలు పనిచేస్తున్నాయి. సుమారు 70శాతం పాఠశాలల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, స్మార్ట్ టీవీలు, కొన్నింటిలో తాగునీటి శుద్ధిప్లాంట్లు, తదితర ఉపకరణాలన్నీ విద్యుత్‌పై పనిచేసేవే ఉన్నాయి. వీటి విని యోగానికి నెలనెలా సగటున వందలు, వేల రూపాయ ల్లోనే విద్యుత్ బిల్లులు వస్తుంటాయి. ఆయా ప్రభుత్వ పాఠ శాలలకు ఇప్పుడున్న విద్యుత్ సర్వీసు, మీటరు నంబర్లను సీఎఫ్ఎంఎస్‌లో ఆన్‌లైన్ విధానంలో నమోదు చేస్తే, సంబం ధిత మండల విద్యాధికారి ధ్రువీకరించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటివరకు 190 ప్రభుత్వ పాఠశాలలు మినహా మిగతా పాఠశాలల హెచ్ఎంలంతా ఉచిత విద్యుత్‌కు వివరాలను నమోదు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కొన్ని పాఠశాలల విద్యుత్ సర్వీసులు, మీటర్లు తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌సంస్థలకు అనుసంధానం కావడం తో ఏపీలో నమోదుకు అడ్డంకిగా ఉందని గుర్తించారు. ఇక ఏలూరు నగరపాలక సంస్థలో కొన్ని పాఠశాలల విద్యుత్ కనెక్షన్లు చాలాఏళ్ల క్రితంనాటివి కావడం, పూర్వపు సర్వీసు నంబర్లకు కొంతకాలం క్రితం నుంచి కొన్ని అంకెలు జోడ వడంతో సీఎఫ్ఎంఎస్‌లో నమోదు కావడం లేదని తేల్చారు. ఏపీఈపీడీసీఎల్ జిల్లా అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి కొద్దిరోజుల క్రితమే పరిష్కరించారు. తెలంగాణ విద్యుత్ మీటర్లు, సర్వీసుల సమస్య పెండింగ్‌లోనే ఉంది.

హెచ్ఎంలపై తప్పిన భారం

ఇప్పటివరకు అమల్లోవున్న విధానం ప్రకారం ప్రభుత్వ పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంటురూపంలో నిధులను ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని విద్యాశాఖ విడుదల చేసేది. ఈ నిధుల నుంచే చాక్‌పీసులు, స్టేషనరీ, మైనర్ రిపేర్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, తదితర ఖర్చులకు వెచ్చించేవారు. ప్రభుత్వ గ్రాంటుకు, పాఠశాలలో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు మధ్య భారీ వ్యత్యాసమే ఉండేది. ఈ అదనపుభారాన్ని హెచ్ఎంలే మోసేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంటు నిధులు సకాలంలో విడుదల కాక ప్రధానోపాధ్యాయులు సొంత నిధులను ఖర్చు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వ పాఠశాలలైనా ఎటువంటి రాయితీలు లేకుండా విద్యుత్ చార్జీలు విధిస్తుండటంతో పలు సందర్భాల్లో ప్రధానోపాధ్యాయులు విద్యుత్ బిల్లులు, బకాయిలు, ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం వద్ద అభ్యర్థించినా పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ప్రభుత్వ పాఠశాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడంతో విద్యుత్ బిల్లుల (మిగతా 8వ పేజీలో)



• తెల్లని లంగా-ఓణి

వివాహ ప్రక్రియలో సంప్రదాయం పాటించాలనుకునే వారు తెల్లని లంగా-ఓణి ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు ఇదే సంప్రదాయం ఉండేది. మళ్లీ ఈ పోకడ ప్రారంభమైంది. జార్జెట్ లేదా ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన బ్లౌజ్, లంగా, ఓణీల మీద... వాటి అంచులకు పసుపు రంగు పూలు, మామిడి పిందెలు, చుక్కలను డిజైన్ చేయించుకుంటున్నారు. ముత్యాలతో రూపొందించిన గాజులు, హారం, ఉంగరాలు, జుంకాలు, పాపిడి బిళ్ల ధరించి అందంగా మెరిసిపోతున్నారు.

సంప్రదాయం

హల్దీకి ట్రెండీగా...

వివాహానికి ముందు రోజు వధూ వరులకు విడివిడిగా జరిపించే ఓ ముఖ్యమైన కార్యక్రమం 'హల్దీ'. దీన్నే మనం మంగళ స్నానాలు అంటూ ఉంటాం. బంధు మిత్రుల ఆనందోత్సాహాలు, కేరింతలు, డ్యాన్స్‌ల మధ్య చాలా సరదాగా కోలాహలంగా సాగుతుంది ఈ ప్రోగ్రామ్. ముఖ్యంగా అమ్మాయి ఇంట జరిగే హంగామా అంతా ఇంతా కాదు. మధ్యలో ఫొటోలు, వీడియోలు అంటూ ఫొటోగ్రాఫర్ల సందడి ఉండనే ఉంటుంది. అందుకే ఈ హల్దీ ప్రోగ్రామ్‌లో అందంగా కనిపించేందుకు ప్రత్యేకమైన లెహంగాలను ఎంచుకుంటున్నారు కాబోయే పెళ్లికూతుళ్లు. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న సరికొత్త లెహంగాలు ఇవే...

లెహంగానే కావాలి

ఒకప్పుడు హల్దీ అనగానే పసుపు లేదా తెలుపు రంగు లంగా-ఓణి లేదంటే చీర ధరించేవారు. క్రమంగా ట్రెండ్ మారుతూ వచ్చింది. ఇండో వెస్ట్రన్ శైలిని ప్రతిబింబించే ఆర్గంజా, నెటెడ్, క్రేప్, జార్జెట్ లెహంగాలను అమ్మాయిలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మల్టీకలర్, ఫ్లోరల్ డిజైన్లనూ ఆదరిస్తున్నారు. హల్దీ ప్రోగ్రామ్‌లో పసుపుకు ఉన్న ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తాము ధరించే డ్రెస్‌లో పసుపు రంగు ఉండేలా చూసుకుంటున్నారు. లేత రంగు లెహంగా మీద పసుపు డిజైన్ ఉండేవాటిని ఎంపిక చేసుకుంటున్నారు. లెహంగా ఏ రంగులో ఉన్నప్పటికీ వాటిమీద పసుపు రంగు టాప్ ధరించి మురిసిపోతున్నారు. ప్రస్తుతం 'మల్టీ కలర్డ్ ఖాలీ' లెహంగాలు సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి.



రఫెల్స్

నెటెడ్ క్లాత్‌ని కుచ్చులు కుచ్చులుగా చేర్చి దానితో లెహంగా, బ్లౌజ్ రూపొందిస్తారు. లేత నీలం, లేత గులాబీ, లేత ఆకుపచ్చ రంగులతో పాటు పసుపు రంగును కూడా మేళవించడం వల్ల హల్దీ ప్రోగ్రామ్ శోభ ఉట్టిపడుతుంది. స్టయిల్‌గా కూడా కనిపిస్తుంది. రఫెల్ బ్లౌజ్‌కు పూర్తిగా కాంట్రాస్ట్ కలర్‌లో ఉన్న లెహంగాను ధరించడం ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండ్.

నెటెడ్ లెహంగాలు

ఇవి దక్షిణాది శైలిని ప్రతిబింబిస్తాయి. లెహంగా మొత్తం పలు లేయర్లుగా ఉంటుంది. ఒక్కో లేయర్ ఒక్కో రంగులో ఉంటుంది. ఇంద్రధనుస్సు రంగులతో లెహంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. భుజం మీదుగా జాలువారే కేప్ దుపట్టా ప్రత్యేకమైన అందాన్నిస్తుంది. ఈ నెటెడ్ లెహంగాల మీద లేత రంగు పాస్టెల్ బ్లౌజ్‌లు చక్కగా అమరుతాయి. వీటి మీద ముత్యపు చిప్పలు, గవ్వలు, శంఖులతో రూపొందించిన నగలు వేసుకోవడం నేటి సరికొత్త ఫ్యాషన్.



• ఖ్యాతి, ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749

ఆస్తా పూనియా... భారత నావికాదళంలో తొలి మహిళా ఫైటర్ పైలెట్‌గా చరిత్ర సృష్టించిన ఆమె త్రివిధ దళాల్లో విస్తరిస్తున్న నవ నారీ శక్తికి ప్రతీక. శ్రమించే తత్వం, కష్టపడే గుణం ఉంటే ఏదీ అసాధ్యం కాదంటున్న ఆస్తా ఎందరో యువతులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

సాగర సమరానికి సై



అది ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరంలో ఒక మధ్యతరగతి కాలనీ. తమ ఇంటికి కాస్త ఎత్తులో దూసుకువెళ్తున్న విమానం శబ్దం ఎప్పుడు వినిపించినా చిన్నారి ఆస్తా పరుగులు పెడుతూ బయటికి వచ్చేది. విమానాలను అబ్బురంగా చూసేది. "ఏదో ఒక రోజు నేను అలాంటి విమానం నడుపుతాను" అని అమ్మకు, నాన్నకు చెప్పేది. ఆ కలను నిజం చేసుకోవడమే కాదు... దేశంలో తొలి మహిళా ఫైటర్ పైలెట్‌గా చరిత్రకెక్కింది. "ఇది చెప్పుకున్నంత సులువుగా జరిగిపోలేదు. తన కలను నిజం చేసుకోవడానికి ఆమె పడ్డ కష్టం ఎంతో ఉంది. చదువులో, ఆటల్లో తను ఎప్పుడూ ఫస్ట్. ఏ పనినైనా పూర్తి ఏకాగ్రతతో చేస్తుంది" అంటారు ఆమె కుటుంబ సభ్యులు.

బీటెక్ చేసి...

ఆస్తాది సైనిక నేపథ్యం ఉన్న కుటుంబం కాదు. ఆమె ఇంజనీర్ కావాలని తల్లిదండ్రులు కోరుకున్నారు. వారి ఆలోచనలను గౌరవిస్తూ ఆమె బీటెక్ చేసింది. అదే సమయంలో... పైలెట్ కావాలనే తన కోరికను మరచిపోలేదు. బీటెక్ పూర్తి కాగానే.... 'షార్ట్ సర్వీస్ కమిషన్' (ఎస్‌సిసి) ద్వారా భారత నావికాదళంలో చేరింది. "నేవల్ ఏవియేషన్‌కు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం. దానికి నా ఇంజనీరింగ్ పునాది ఉపకరించింది" అని చెబుతుంది ఆస్తా. మొదట కేరళలోని ఎజిమలలో ఉన్న ప్రతిష్ఠాత్మకమైన 'ఇండియన్ నేవల్ అకాడమీ' (ఐఎన్ఎ)లో శిక్షణ పొందింది. ఆ తరువాత హైదరాబాద్‌లోని దుండిగల్ 'ఎయిర్ ఫోర్స్ అకాడమీ'లో ప్రాథమిక వైమానిక శిక్షణ తీసుకుంది. సైనిక విమానాలు నడపడంలో తొలి పాఠాలు అక్కడే నేర్చుకుంది. ఆ తరువాత విశాఖపట్నంలోని 'ఐఎన్ఎస్ డేగా'లో హాక్ అడ్వాన్స్‌డ్ జెట్ ట్రైనర్ (ఎజెటి) మీద అడ్వాన్స్‌డ్ ఫ్లయింగ్, ఆ తరువాత ఫైటర్ ఫైటర్ పైలెట్‌గా ఎదురయ్యే సవాళ్లకు సిద్ధం కావడం కోసం అవసరమైన 'సెకెండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్సు'లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. క్వాలిఫైడ్ నేవల్ ఏవియేటర్‌కు గుర్తింపు చిహ్నమైన 'గోల్డ్ ఆఫ్ వింగ్స్'ను ఈ నెల మూడో తేదీన రియర్ అడ్మిరల్ జనక్ బెల్వీ చేతుల మీదుగా అందుకొని, అది సాధించిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

ఆ దిశగా గట్టి అడుగు

ఇది ఆస్తా వ్యక్తిగతమైన ఘనత మాత్రమే కాదు, భారత రక్షణ దళాల్లో నారీ శక్తిని... మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా, 'మారిటైమ్ ఇండియా విజన్ - 2030' లక్ష్యాల దిశగా వేసిన గట్టి అడుగు కూడా. ఇక 'హాక్ ఏజేటీ' మీద కూడా శిక్షణ పొందిన తరువాత మిగ్29 కె ని నడపడానికి ఆస్తాకు పూర్తి అర్హత లభిస్తుంది. ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య లాంటి విమాన వాహక నౌకల నుంచి ప్రయోగించే యుద్ధ విమానాలను నడిపిస్తూ... సరిహద్దుల భద్రతలో కీలక పాత్ర పోషించే అవకాశాన్ని ఆమె అందుకుంటుంది. "ఇది ఉద్వేగభరితమైన క్షణం. దేశ రక్షణలో భాగం కావడం గర్వంగా ఉంది" అంటున్న ఆస్తా... ఎంతో మంది యువతులకు స్ఫూర్తిప్రదాత అవుతుందనడంలో సందేహం లేదు.

ప్రత్యేకం

సింహపురి (నెల్లూరు) గడ్డపై ఉన్న బారాషహీద్ దర్గా మతసామరస్యానికి ప్రతీక. దాన్ని కుల, మత, వర్గాలకు అతీతంగా ఎవరైనా దర్శించుకోవచ్చు. అక్కడ జరిగే రొట్టెల పండుగ ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఏటా అయిదు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్త జనం తరలివస్తారు. నేడు ప్రారంభమవుతున్న ఈ వేడుకలకు ఘనమైన చరిత్రే ఉంది.

మత సామరస్యానికి ప్రతీక



ఆర్కాడు నవాబు కాలం నుంచి.

సుమారు 400 సంవత్సరాల క్రితం సౌదీ, మక్కా షరీఫ్ నుంచి 300 మంది మత ప్రచారకులు భారతదేశానికి వచ్చారు. ఆ సమయంలో కర్ణాటకలో హైదర్ అలీ పాలన, నెల్లూరులో నవాబు పాలన ఉండేవి. ఆ ప్రచారకుల్లో 12 మంది నెల్లూరు జిల్లాలో పర్యటిస్తూ... కొడవలూరు మండలం గండవరం చేరుకున్నారు. అప్పుడు వారికి, బ్రిటిష్ సైనికులకు మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఆ ప్రచారకులు ప్రాణత్యాగం చేశారు. వారి తలలు గండవరం వద్ద పడిపోగా... వారి మొండేలతో గుర్రాలు నెల్లూరు చేరాయి. ఆ మొండేలను స్థానికులు స్వర్ణాల చెరువు వద్ద సమాధి చేశారు. కొన్నేళ్ళ తరువాత... ఆ చెరువులో రజక దంపతులు దుస్తులు ఉతికి, అక్కడ ఉన్న చెట్టు కింద విశ్రమించారు. ఆ రజకుడి భార్యకు ఒక దైవ స్వరూపుడు కలలోకి వచ్చి.. బారా షహీద్‌ల సమాధుల వద్ద ఉన్న మట్టిని లేపనం చేసుకున్నవారు అనారోగ్యం నుంచి కోలుకుంటారని చెప్పాడు. ఆమె తన కల గురించి భర్తకు చెప్పింది. ఈ విషయాన్ని దగ్గరలో ఉన్న రాజభటులకు ఆ దంపతులు నివేదించారు. వారిని ఆర్కాటు నవాబు దగ్గరకు భటులు తీసుకువెళ్ళారు. అప్పట్లో నవాబు కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె స్వస్థత కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో... ఆ దంపతులు చెప్పిన మాటలను నవాబు విశ్వసించాడు. వాటిని పాటించాడు. ఒక రోజు గడవకముందే కుమార్తె ఆరోగ్యం బాగుపడటం చూసి నవాబుకు ఆశ్చర్యం కలిగింది. అతను బారాషహీద్ సమాధుల వద్దకు చేరుకొని పూజలు చేశాడు. సమాధుల దగ్గర ఉన్న మట్టితో లేపనం చేసుకోవడం వల్ల నవాబు కుమార్తె ఆరోగ్యం బాగుపడిందని ప్రజలకూ తెలియడంతో అందరూ ఆ దర్గాలో పూజలు ఆరంభించారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో ఆ సమాధులకు పూజలు జరుగుతున్నాయి.



కోరికలెన్నో... రొట్టెలు ఎన్నెన్నో

రొట్టెల పండుగలో... కొత్త కోరికలు కోరుకొనేవారు, కోరికలు తీరినవారు... ఇలా ఎందరో 'వరాల రొట్టెల'ను అందుకుంటారు. ప్రసాదాలుగా భావించే ఈ రొట్టెల్లో... కాలక్రమేణా రకరకాల రొట్టెలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, సంతానం, భాగ్యం, ఇల్లు... ఇలా వివిధ కోరికలు తీరాలనుకొనే వారి కోసం ఎన్నెన్నో రొట్టెలు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రొట్టెల ప్రసాదం ద్వారా కోర్కె తీరిన భక్తులు మరుసటి ఏడాది విధిగా ఈ పండుగకు వచ్చి... తమ చేతుల మీదుగా మరొకరికి రొట్టెను పంచడం, కోర్కెలు సఫలం కావడం కోసం ఆ రొట్టెను మహాప్రసాదంగా స్వీకరించడం ఈ పండుగ విశేషం. రొట్టెల పండుగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను నెల్లూరు నగరవాసులు అతిథులుగా భావించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారు.

హిందువులు పెట్టిన పేరే..

ఆర్కాట్ నవాబు 1757లో ఆ ప్రదేశంలో పండుగను ప్రారంభించినట్టు చరిత్ర చెబుతోంది. పూజలు చేసేందుకు వచ్చిన వారు తమ వెంట తెచ్చుకున్న రొట్టెలను తిని, మిగిలి వాటిని అక్కడే ఉన్నవారికి పంచేవారు. అలా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు తినడం, పక్కవారికి ఇవ్వడం రొట్టెల పండుగలో ఆనవాయితీ అయింది.. నవాబు పాలనలో... ఆయన ప్రతినిధిగా ఖాజీ ఆధ్వర్యంలో పండుగ జరిగేది. ముస్లింలు ఈ పండుగను 'మొహర్రం జియారత్' అని పిలుచుకునేవారు. అయితే, చెరువు వద్ద రొట్టెలు మార్చుకొనే ఆనవాయితీ కారణంగా దీన్ని 'రొట్టెల పండుగ' అనే పేరు స్థిరపడిపోయింది. ఈ పేరు హిందువులు పెట్టిన పేరేననీ, అది తమకు గర్వంగా ఉందని దర్గా సంరక్షకులు చెబుతున్నారు. అలా మొదలైన రొట్టెల పండుగ ఖ్యాతి నెల్లూరు జిల్లా సరిహద్దులు దాటి విదేశాలకు పాకింది.



• గోళ్ల రామకృష్ణ
ఫొటోలు: ఎస్‌డీ జకీర్

సండే సెలబ్రిటీ

ఈ మధ్యకాలంలో ఓటీటీలో నేరుగా విడుదలయ్యే సినిమాలు... వెబ్‌సిరీస్‌ల్లో ప్రధాన పాత్రలు పోషిస్తూ అలరిస్తున్న హీరో... నవీన్ చంద్ర. తాజాగా ఆయన నటించిన 'షోటైమ్' థియేటర్లలో విడుదలయింది. ఓటీటీ సిరీస్‌ల గురించి... ప్రేక్షకుల అభిమానం గురించి ఆయన 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

ఓటీటీ కింగ్ అంటున్నారు!



మీ దృష్టి కథలపైనా? ఖరీదైన ప్రొడక్షన్‌పైనా?

నేను మంచి కథలను ఎంచుకోవటానికి ప్రయత్నిస్తున్నా. ప్రొడక్షన్ విలువలు.. బడ్జెట్‌లు ఈ విషయాలపై కాకుండా నా నటనపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నా. దీనివల్ల కొంత సంతృప్తి కలుగుతోంది. అంతే కాదు... ఈమధ్య కాలంలో నా దగ్గరకు మంచి కథలు వస్తున్నాయి. మంచి డైరక్టర్లు కూడా వస్తున్నారు.

కొన్ని చిన్న సినిమాలు ఓటీటీల్లో సూపర్‌హిట్ అవుతున్నాయి. అవే సినిమాలను చూడటానికి ప్రేక్షకులు థియేటర్‌కు ఎందుకు రావటం లేదు?

మా ప్రమోషన్ సరిపోవటంలేదా... అనే అనుమానం వస్తోంది. చిన్న సినిమాలకు సోషల్ మీడియాలో ఎక్కువగానే ప్రమోషన్స్ చేస్తున్నాం. ప్రేక్షకుల కామెంట్స్ కూడా పాజిటివ్‌గా వస్తున్నాయి. కానీ ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమాలను ఎక్కువగా ఎందుకు చూడటం లేదనే విషయం తెలియటంలేదు. ఒకప్పుడు మొదటి రోజు 'సినిమా బాగుంది' అనే టాక్ వస్తే ప్రేక్షకులు తప్పనిసరిగా థియేటర్‌కు వస్తారనే నమ్మకం ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. చాలా జాగ్రత్తగా ఆలోచించి, అన్ని రకాలుగా బాగుందని నిర్ణయించుకుంటేనే థియేటర్‌కు వస్తున్నారు. మేము కూడా చాలా జాగ్రత్తగా కథలను ఎంచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మీకు ఏ తరహా పాత్రలంటే ఎక్కువ ఇష్టం?

ఒక నటుడిగా రకరకాల పాత్రల్లో నటించటానికి తగిన శిక్షణ తీసుకొని సిద్ధంగా ఉన్నా. యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ డ్రామా ఇలా... ఇప్పటిదాకా నేను చేసిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లలో మంచి పాత్రలే లభించాయి. ప్రేక్షకులు కూడా బాగా ఆదరించారు. ఈ మధ్య విడుదలైన 'షోటైమ్' చిన్న సినిమా. కామెడీ థ్రిల్లర్. చాలా సహజంగా ఉంటుంది. మన జీవితంలోని సంఘటనలే దీనిలో కనిపిస్తాయి. నేను జిమ్ కోచ్‌గా నటించాను. కొన్ని ప్రీమియర్ షోలు వేశాం. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ఎక్కడా వయలెన్స్ ఉండదు. పెద్ద పెద్ద ట్విస్టులు ఉండవు. రాజా రవీంద్ర ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన కూడా చాలా బాగా చేశారు. ఇక నేను చేసిన మిగిలిన పాత్రల విషయానికి వస్తే... 'గేమ్ ఛేంజర్' సినిమాలో నాకు డూప్ దొరకలేదు. దాంతో ఆ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లన్నీ నేనే చేశా. ఇదే విధంగా 'పరంపర' సీరియల్ ఒక ఫ్యామిలీ డ్రామా. దీనిలో నేను ఒక ముఖ్యమైన పాత్ర పోషించా. రాబోయే ఒక సినిమాలో పరిస్థితులకు తగినట్లుగా హ్యూమర్ ఉంటుంది. ఈ పాత్ర చాలా బాగా వచ్చింది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనుకుంటున్నా.

మొత్తానికే మోసం...

మంచి కథలు అనేకం ఉన్నాయి. మంచి రచయితలు అనేకమంది ఉన్నారు. కానీ ఈ మధ్యకాలంలో కథా గమనంలో సాంకేతికతను చొప్పించటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించటానికి ఇదొక మార్గం అని భావిస్తున్నారు. అయితే కథకు అవసరమైన మేరకే సాంకేతికతను జొప్పించాలి. లేకపోతే మొత్తానికే మోసం వస్తుంది.

టెలివిజన్ స్థానాన్ని ఓటీటీ ఆక్రమించిందని అనుకుంటున్నారా?

కొంతవరకు ఆక్రమించింది. ఒకప్పుడు టెలివిజన్‌ను రోజంతా చూసేవారు. ఇప్పుడు యాప్స్ వచ్చేశాయి. దీనిలో సీరియల్స్, సినిమాలు ఏవైనా చూసుకోవచ్చు. టెలివిజన్‌లో చూడటానికి ఎన్ని ప్రత్యామ్నాయ కార్యక్రమాలు ఉంటాయో.. అవన్నీ ఓటీటీలోనూ లభిస్తున్నాయి. దీనివల్ల ఇంట్లో కూర్చొని చూసే ప్రేక్షకులకు ఓటీటీ ఒక వరం. దీంతో ఎక్కువమంది అటు టెలివిజన్.. ఇటు ఓటీటీ రెండూ చూస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒక సినిమా విజయవంతం అవ్వాలంటే... ఒక వారం బాగా ఆడాలి. ఏదైనా పెద్ద సినిమాను తీసుకుందాం. విడుదలైన తర్వాత రెండు రోజులు హీరో అభిమానులు హడావుడి చేస్తారు. ఆ తర్వాత ఫ్యామిలీ ఆడియన్స్ రావాలి. కానీ ఓటీటీకి అలవాటు పడ్డ ప్రేక్షకుల్లో ఎక్కువమంది ఇల్లు కదిలి థియేటర్‌కు రావటానికి ఇష్టపడటం లేదు. దీని ప్రభావం సినిమాలపై పడుతోంది.

ఓటీటీలలో మీ సక్సెస్ రేట్ చాలా ఎక్కువనుకుంటా?

నేను చేసిన సిరీస్‌లు, సినిమాలు అన్నీ ఓటీటీల్లో సూపర్‌హిట్ అయ్యాయి. కొందరైతే నన్ను 'ఓటీటీ కింగ్' అంటున్నారు. మా చెల్లి హైదరాబాద్‌లో పని చేస్తోంది. తను 'షోటైమ్' చూసింది. మొన్న వచ్చి... 'నవీన్ అన్నా.. షోటైమ్ చూశా. చాలా బాగుంది. ఓటీటీలో వస్తే పెద్ద హిట్ అవుతుంది. నీకు ఓటీటీలో ఎక్కువ ఫ్యాన్స్ ఉన్నారు' అంది. నాకు ఎలా రియాక్ట్ కావాలో అర్థంకాలేదు. నేను ఇప్పటిదాకా నాలుగు వెబ్ సిరీస్‌లు, నాలుగు వెబ్ ఫిల్మ్స్ చేశాను. ఇవన్నీ బాగా హిట్ అయ్యాయి. దీనికి ఒక కారణం ఉంది. ఓటీటీ ప్రారంభ దశలో నాకు హీరో వేషాలు రాలేదు. పెద్ద పెద్ద నటులున్న సినిమాల్లో మంచి క్యారెక్టర్స్ వచ్చాయి. ఓటీటీలో ఇన్‌స్పెక్టర్ 'రుషి, అమ్ము, భానుమతి రామకృష్ణ, బ్రో' లాంటివన్నీ బాగా హిట్ అయ్యాయి. 'లెవెన్' సినిమాను రెండు వారాల్లో 25 కోట్ల మంది చూశారు. చాలా మంది వీటిని ఓటీటీ వచ్చిన వెంటనే చూసేస్తారు. ఇదే విధంగా థియేటర్లలో నా సినిమాలు చూడాలని దేవుడిని ప్రార్థిస్తూ ఉంటా!

• సీవీఎల్ఎన్ ప్రసాద్

గోరువెచ్చని నీరు తాగితే...

తగినంత నీరు తాగకపోతే శరీరం వ్యాధుల పాలవుతుంది. రోజూ పరగడుపునే గోరువెచ్చని నీరు తాగితే చాలా వరకు అనారోగ్య సమస్యలు తీరిపోతాయని నిపుణులు సూచిస్తున్నారు.



- ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలో జీవక్రియలు ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి. నరాల పనితీరు మెరుగుపడుతుంది. మెదడు చురుకుగా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- జీర్ణక్రియ వేగవంతమవుతుంది. అజీర్ణం, కడుపులో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం లాంటివి తగ్గుతాయి.
- రాత్రిపూట శరీరంలో పేరుకున్న వ్యర్థ పదార్థాలన్నీ పూర్తిగా విసర్జితమవుతాయి. పేగులు, మూత్రపిండాలు, జననేంద్రియాలు పరిశుభ్రమవుతాయి.
- వేడి నీరు తాగడం వల్ల గొంతులో చేరిన శ్లేష్మం తొలగిపోతుంది. గొంతులో గర గర, ముక్కు దిబ్బడ, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- శరీరంలో పేరుకుపోయిన కొవ్వులు కరుగుతాయి. దీంతో బరువు తగ్గి శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంటుంది.
- నెలసరి సమయంలో వేడి నీరు తాగడం వల్ల కడుపునొప్పి, అలసట, నీరసం, విసుగు లాంటి సమస్యలు తగ్గుతాయి.
- నిద్రలేమితో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే ఒత్తిడి తగ్గి సమస్య తీరుతుంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఆప్ జైసా కోయి	హిందీ చిత్రం	జూలై 11
సోనీ లివ్		
నరివెట్టా	మలయాళ చిత్రం	జూలై 11
జియో హాట్‌స్టార్		
మూన్‌వాక్	మలయాళ చిత్రం	జూలై 08
బుక్ మై షో		
గుడ్ వన్	హాలీవుడ్ మూవీ	జూలై 08

పంచాయతీ పురోగతిపై శిక్షణ

ఏలూరుసిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచికపై శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి కంప్యూటర్ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో సుస్థిరాభివృద్ధి , లక్ష్యాల సాధనలో సాధించిన పురోగతిని అవచనా వేయడం, 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 100 శాతం సాధించే దిశగా గ్రామ స్థాయిలో గల 17 లైన్ డిపార్ట్‌మెంట్స్ నుంచి 147 సూచికలకు సంబంధించి 227 డేటా పాయింట్స్‌ని వెబ్‌సైట్‌లో పొందుపరటంపై శిక్షణ ఇచ్చారు. జడ్పీ సీఈవో శ్రీహరి ప్రారంభించగా జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వర్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీపీవో కొడాలి అనూరాధ పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏలూరు డీఆర్ కె.సత్యవతి

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

ఏలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి):కలెక్టరేట్‌లోని జిల్లా సహకార శాఖాధికారి, ఆడిట్, డీఆర్ కార్యాలయాల వద్ద అంతర్జాతీయ సహకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి, ఇన్‌ఛార్జి డీసీవో కోటిపల్లి వెంకటేశ్వరరావు సహకార జెండాను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది అంతర్జాతీయ సహకార దినోత్సవంగా ప్రకటించిందని, ఆ స్ఫూర్తితో సహకార రంగంలో సమ్మిళిత అభివృద్ధి సాధనకు అధికారులు, ఉద్యోగులు మమేకం కావాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో రాబోయేకాలంలో సహకార సేవలను విస్తరించనున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు డివిజనల్ కోపరేటివ్ అధికారి సత్యవతి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. డీసీవో కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అక్రమ్ బాషా, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా సౌకర్యాలపై జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

ఏలూరుసిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన మాధ్యమిక విద్యపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారులు , ఉప విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు. స్కూల్ రీఓపెనింగ్, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన నిర్వహణ, ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై పద్మశ్రీ సమగ్రంగా చర్చించారు. స్కూల్ యూనిఫాం, షూ, బ్యాగ్‌లు, స్టేషనరీ వంటి విద్యా కిట్ల పంపిణీ ప్రగతిపై సమీక్ష చేశారు. కొన్ని మండలాల్లో సరఫరాలో ఆలశ్యం ఉన్నట్లు గుర్తించి, వాటిని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా పరిశుభ్రమైన వాతావరణంలో అందించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను తాత్కాలిక భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ నిధులతో ఉమ్మడి విద్యాశాఖ రూపొందించిన విజయకేతనం పుస్తకం గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని గణనీయంగా పెంచిందన్నారు. ఈ పుస్తకాన్ని ముందుగా విద్యార్థులకు అందించగలిగితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీహరి, డిప్యూటీ సీఈవో భీమేశ్వర్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, నారాయణ, ఉప విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

తణుకు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : తణుకు చిట్టూరి సుబ్బారావు, గోపీచంద్ అకాడమీలో ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి, సెక్రటరీ మెంటే వంశీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -19 బాల.బాలికలకు, పురుషులు, మహిళలు, వెటరన్స్ 35 ప్లస్, 45ప్లస్, 50 ప్లస్ 55 ప్లస్, 60 ప్లస్, 70 ప్లస్ వయసుగల విభాగంలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీలు ఉంటాయని చెప్పారు. గెలిపొందినవారు రాష్ట్ర పోటీలలో, జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. పోటీలను ఎస్‌కెఎస్‌డీ గ్రూప్ ఆఫ్ కాలేజీ స్పాన్సర్ చేస్తున్నట్లు ఆ సంస్థల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు తెలిపారు. వివరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్‌బాబు 98496 66223, 97014 04675 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రి నిర్మాణానికి రూ. కోటి విరాళం

సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి అందజేసిన పరమేశ్ బయోటెక్ ఎండీ

గోపాలపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక అవసరాలకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి పెట్టారు. దీనిలో భాగంగా దాతల సాయం కోసం ప్రయత్నించారు. పరమేశ్ బయోటెక్ లిమిటెడ్ ఎండీ ఆనంద్ స్వరూప్ ముందుకు వచ్చారు. ఈ మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ పి.ప్రశాంతికి సీఆర్ఎస్ ఫండ్స్ నుంచి ఆసుపత్రి ఉన్నతికి రూ.కోటి మంజూరు పత్రాన్ని ఎండీ ఆనంద్‌స్వరూప్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూ.కోటి విరాళంగా ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి రూ.కోటి చెక్‌ను ఎమ్మెల్యే మద్దిపాటి సమక్షంలో అందజేస్తున్న పరమేశ్ బయోటెక్ లిమిటెడ్ ఎండీ ఆనంద్‌స్వరూప్



పండుగలకు పిలుపు

నేడు తొలి ఏకాదశి

ఆలయాలు ముస్తాబు

ద్వారకాతిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ఇది తెలుగు ప్రజలకు పవిత్రమైన తొలి పండుగ. శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే ఈ రోజు నుంచి భక్తులలో ఆధ్యాత్మిక భావనలు ఉప్పొంగుతాయి. జిల్లాలోని అన్నివైష్ణవ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి నాడు స్వామికి పేల పిండిని నైవేద్యంగా పెడతారు. అనంతరం రాత్రి ఉభయదేవేరులతో స్వామి వారు క్షేత్ర పురవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పిస్తారు.

ఈరోజు నుంచే పండుగలు ప్రారంభం

అసలు ఈ ఏకాదశి నుంచే పండుగలన్నీ మొదలవుతాయి. అందువల్లే దీనిని తొలి పండుగ అని.. తొలి ఏకాదశి అని పిలుస్తారు. తొలి ఏకాదశిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తుంటారు. ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు విష్ణుమూర్తి పాలకడలిపై శయనిస్తారట. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల కంటే ఆషాఢంలో వచ్చే తొలి ఏకాదశి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. అందుకే ఈ రోజు ఉపవాసం ఉంటే ఆ విష్ణుమూర్తి అనుగ్రహం తప్పక లభిస్తుందని చెబుతారు. ఈ రోజు ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ పూజకు శుభసమయం. తొలి ఏకాదశి నుంచి దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమవుతోంది.

తొలి ఏకాదశి ఎప్పుడు జరుపుకోవాలి

ప్రతి ఏటా ఆషాఢ మాసం శుక్ల పక్ష ఏకాదశి తిథి రోజున తొలి ఏకాదశి జరుపుకుంటారు. ఈ సారి ఈ తిథి జూలై 6న వచ్చింది. హిందూ క్యాలెండర్ ప్రకారం ఏకాదశి తిది శనివారం సాయంత్రం 6.58 గంటలకు ప్రారంభమై ఆదివారం రాత్రి 9.14 గంటలకు ముగుస్తుంది. ఉపవాసం ఎల్లప్పుడూ ఉదయ తిది రోజున పాటిస్తారు. కనుక ఈ తొలి ఏకాదశి ఉపవాసం ఆదివారం పాటించాల్సి ఉంటుంది.

ఉపవాసాలకు శుభసమయం

తొలి ఏకాదశి ఉపవాసం ద్వాదశి తిథిలో అంటే సోమవారం విరమించాల్సి ఉంటుంది. ఉపవాసం విరమించ డానికి శుభసమయం ఉదయం 5.29 నుంచి 8.16 వరకూ ఉంటుంది. ఈరోజు ద్వాదశి తిది రాత్రి 11.10 గంటలకు ముగుస్తుంది. కనుక ఉదయం ఉపవాసం విరమించడానికి శుభప్రదం.

తొలి ఏకాదశి ప్రాముఖ్యత

ఈ ఏకాదశి రోజున యోగనిద్రలోకి వెళ్లే విష్ణువు కార్తీక మాసంలోని శుక్ల ఏకాదశి రోజున మేల్కొంటారని నమ్ముతారు. ఈ నాలుగు నెలలను చాతుర్మాసం అంటారు. ఈ సమయంలో సాధన, ఉపవాసం, ఆధ్యాత్మిక పనులు ఫలవంతమైనవిగా భావిస్తారు. అయితే వివాహం, గృహ ప్రవేశం వంటి శుభకార్యాలు నిషేధించబడ్డాయి. హిందూ మత విశ్వాసాల ప్రకారం దేవశయని ఏకాదశి రోజున ఉపవాశం వల్ల జీవితంలో ఆనందం, శాంతి, శ్రేయస్సు లభిస్తుంది. పాపాల నుంచి విముక్తి పొంది మోక్షం పొందుతాడని పురాణాలు ప్రవచిస్తున్నాయి. ఈ రోజున విష్ణు సహస్రనామ పారాయణ, లలిత సహస్రనామ పారాయణ, పేదలకు అన్నదానం, వస్త్రదానం వంటివి చేస్తే ఆ దేవదేవుని అనుగ్రహం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. అంతేకాకుండా తొలి ఏకాదశి ఒక్కరోజు ఉపవాసం ఉంటే.. ఏడాదిలో వచ్చే 24 ఉపవాసాలు చేసినంత పుణ్యం వస్తుందని పండితులు వివరిస్తున్నారు.



శ్రీకృష్ణుడిగా జగన్నాథుడు

ద్వారకాతిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణుడిగా జగన్నాథుడి దర్శనం భక్తులను అలరించింది. పురాతన లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా శనివారం సుభద్ర, బలభద్రులతో కలసి స్వామివారు శంకు చక్రాలను, పిల్లనగ్రోవిని ధరించి, శిరస్సుపై నెమిలి పింఛంతో నీల మేఘశ్యాముడిగా దర్శనమిచ్చారు.

గోవింద నామాలతో శోభిల్లిన శ్రీవారి క్షేత్రం

గోవింద నామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు విచ్చేశారు. దాదాపు 15 వేల మంది వరకు భక్తులు వచ్చి ఉంటారని అధికారుల అంచనా. భక్తులు ముందుగా మొక్కుబడులు తీర్చుకుని స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ, ప్రసాదాలను, నిత్యాన్నదాన సదనంలో అన్నప్రసాదం స్వీకరించారు.

డిప్యూటీ సీఎం భట్టి చొరవతో క్యాన్సర్ నుంచి బయటపడిన ఏలూరు మహిళ

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఓ మహిళ క్యాన్సర్ బారి నుంచి బయటపడింది. దీంతో ఆమె భర్త శనివారం భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరుకు చెందిన రామకృష్ణ హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య క్యాన్సర్‌తో బాధ పడుతుండడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కొంత కాలం తర్వాత వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడడంతో గాంధీ భవన్‌లో జరిగిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో రామకృష్ణ కుమారుడు భట్టి విక్రమార్కను కలిసి పరిస్థితిని వివరించారు.దీంతో ఆయన స్పందించి వైద్య ఖర్చులకు సంబంధించి ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ను ఇప్పించారు. ఈ ఎల్‌ఓసీ భరోసాతో తన భార్యకు ఐదుసార్లు కీమో థెరపి చేయడంతో క్యాన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా బయట పడినట్లు వైద్యులు నిర్ధారించారని రామకృష్ణ భట్టికి వివరించారు.

ట్రిపుల్ ఐటీ తొలి దశ అడ్మిషన్లు పూర్తి

నూజివీడు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో తొలి దశ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభమైన అడ్మిషన్లలో జూన్ 30, జూలై 1వ తేదీన ఆర్కే వ్యాలీ, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించగా ఈ నెల రెండు, మూడు తేదీలలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు, శుక్ర, శనివారాల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం నాటి కౌన్సెలింగ్‌ను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్, ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్ పటేల్ పర్యవేక్షించారు. చివరి రోజు మొత్తం 555 మంది మెరిట్ విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 430 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ రిజిస్టర్ అయ్యారు. బాలురు 126 మంది, బాలికలు 271 మంది ప్రవేశాలు పొందారు.

మెగా పీటీఎంకు విట్నెస్ ఆఫీసర్ల తంటా !



నియామకాలపై ఆదేశాలను ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఏలూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం (పీటీఎం 2.0) కార్యక్రమాలకు ప్రత్యక్ష పరిశీలన నిమిత్తం విద్యాశాఖేతర ఉద్యోగులను విట్నెస్ అధికారులుగా నియమించాలని పాఠశాల విద్య ఉన్నతాధికారులు శనివారం జారీచేసిన ఉత్తర్వులు వివాదాస్పదమవుతున్నాయి. ఈ ఆదేశాలతో టీచర్ల పనితీరుని ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల వద్ద అపోహలకు, హేళనకు గురిచేసినట్టుగా భావించాల్సి వస్తోందని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయి. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి, స్కూలులో మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన నిమిత్తం మెగా పీటీఎం నిర్వహణను రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 10న అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జరపాలని విద్యాశాఖ నిర్ణయించిన విషయం విదితమే. ఈ క్రమంలో పీటీఎం 2.0 నిర్వహణను విజయవంతం చేయడానికి మొత్తం 17 రకాల కమిటీలను పాఠశాలల వారీగా నియమించాలని హెచ్‌ఎంలకు నిర్దేశించింది. ఇందులో భాగంగానే పీటీఎం కార్యక్రమాలు సరిగా చేస్తున్నదీ, లేనిదీ గమనించడంతో పాటు, వాటిని వీడియో చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయడానికి ప్రతీ పాఠశాలకు ఒక విట్నెస్ ఆఫీసర్‌ను నియమించాలని మండలాల్లోని సీఆర్పీలు వారి పరిధిలోని హెచ్‌ఎంల గ్రూపుల్లో పెట్టారు. దీనికనుగుణంగా విద్యాశాఖేతర ఉద్యోగిని విట్నెస్ ఆఫీసర్‌గా నియమించుకుని వారి ఆధార్ నంబరు, ఎంప్లాయి ఐడీ, సీఎఫ్‌ఎంఎస్ వివరాలు, తదితర సమాచార మంతటినీ స్ప్రెడ్ షీట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా గ్రామాల్లో విద్యాశాఖేతర ఉద్యోగుల కోసం ఉపాధ్యాయుల వెతకులాట శనివారం ముమ్మరంగా జరిగింది. కొన్నిశాఖల ఉద్యోగులైతే తమ శాఖ హెచ్‌వోడీల నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని, మరికొందరు ఈనెల 10న ఆన్‌డ్యూటీ పెట్టుకుని పీటీఎం కార్యక్రమాలకు వెళ్లాలని మౌఖిక ఆదేశాలు కూడా ఇవ్వలేదని పలుచోట్ల హెచ్‌ఎంలకు తిరుగు సమాధానం వచ్చింది. దీంతో విట్నెస్ ఆఫీసర్ల కోసం స్థానికంగా విధులు నిర్వర్తించే ఉద్యో గులు ఎక్కడున్నారో వాకబుచేసి,వారి సందేహాలను నివృత్తి చేయడం, ఒకవిధంగా బతిమలాడుకోవడం ప్రధానోపాధ్యాయుల వంతైందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యాశాఖలో వున్న అధి కారులు, ఉద్యోగులతో పీటీఎం కార్యక్రమాలను పర్యవేక్షింప జేయ కుండా ఇతర శాఖల సిబ్బందికి బాధ్యతలు అప్పగించడం ద్వారా టీచర్లను అవమానపరుస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర మాట్లాడుతూ పీటీఎం కార్యక్రమాలను వీడియో తీసి అప్‌లోడ్ చేయడానికి ఒక అధికారి/ఉద్యోగిని ఉపాధ్యాయులే నియమించుకుని రిజిస్టర్ చేయాలని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జారీచేసిన ఆదేశాలను ఖండిస్తున్నామన్నారు. జిల్లాలో ఎవరూ విట్నెస్ అధికారులను నియమించవద్దని, ఇప్పటికైనా బోధనేతర పనులను టీచర్లతో చేయించడాన్ని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో)జిల్లా చైర్మన్ మోహన్, ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు రామ్మోహన్ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన నెలరోజులలోపే బోధనేతర పనులతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నారని, తక్షణమే విట్నెస్ ఆఫీసర్ల నియామకాలను రద్దుచేయాలని కోరారు.

రాజీయే రాజమార్గం

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ఏలూరు క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వలన ఇరుపక్షాల వారు గెలుపొందినట్లేనని, రాజీమార్గం ఉత్తమమైన మార్గం అని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఏలూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హాలులో ఏర్పాటు చేసిన ప్రారంభ సమావేశంలో .శ్రీదేవి మాట్లాడుతూ కక్షిదారులకు త్వరితగతిన కేసులు పరిష్కారం నిమిత్తం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కక్షిదారులు సౌలభ్యం కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 35 బెంచీలను ఏర్పాటు చేసి త్వరితగతిన కేసుల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాలు గెలుపొందినట్లే అవుతుందని అదే కోర్టులు ద్వారా వెలువరించిన తీర్పులు ఒకరు గెలవడం మరొకరు ఓడిపోవడం అనేది జరుగుతుందన్నారు. శనివారం ప్రారంభంగా వాహన ప్రమాద బీమా కేసులో 85 లక్షలు పరిహారం చెల్లించినట్లు శ్రీదేవి తెలిపారు. రెండవ అదనపు జిల్లా జడ్జి ఇందిరా ప్రియదర్శిని, ఐదవ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ, ఏడవ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, 8వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, పోక్సో జడ్జి శ్రీవాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బిజె రెడ్డి, లోక్ అదాలత్ సభ్యుడు కానాల రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

6,465 కేసులు పరిష్కారం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 6,465 కేసులను పరిష్కరించారు. 6,324 పెండింగ్ కేసులను పరిష్కరించామని, 141 ప్రీ లిటికేషన్ కేసులను రాజీ చేసినట్టు న్యాయాధికారి శ్రీదేవి తెలిపారు. వీటిలో మోటారు వాహన ప్రమాద కేసులు 129, సివిల్ కేసులు 219, క్రిమినల్ కేసులు 5,976 ఉన్నాయన్నారు . ప్రీలిటికేషన్ కేసులు 141 రాజీ చేశామన్నారు.



ప్రమాద బీమా కేసులో చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎస్.శ్రీదేవి

20 ఏళ్ల కేసుకు మోక్షం

ఎన్నో ఏళ్లుగా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులు సైతం పరిష్కారం జరిగింది. 2005 సంవత్సరానికి సంబంధించి భూ పరిహార అమలు పిటీషన్ (ఈపీ)లో మూడు లక్షల 50 వేల రూపాయలకు రాజీ చేశారు. 2017లో భూ పరిహార కేసులలోని ఈపీలను లోక్‌అదాలత్‌లో పరిష్కరించి ఒకొక్క ఈపీకి లక్షా 22 వేల 576 రూపాయలు చొప్పున పరిహారం చెల్లించారు. 2018వ సంవత్సరానికి చెందిన రెండు సివిల్ కేసులు కూడా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బుల్లికృష్ణ రాజీ చేశారు.

రౌడీ షీటర్ అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఒక రౌడీషీటర్ డ్రైయిన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు పెదపాడు రోడ్డులోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న బలిరెడ్డి విజయ్‌సాయి (42)పై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. సెంట్రింగ్ పనులకు వెళ్తూ ఉంటాడు. ఈనెల 4వ తేదీ రాత్రి 8 గంటలకు సినిమాకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సాయి తిరిగి రాలేదు. శనివారం ఉదయం వంగాయిగూడెం సెంటర్ వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో డ్రైయిన్‌లో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వ డంతో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగబాబు వారి సిబ్బంది వచ్చి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతిగా మద్యం తాగి ఉన్నట్లుగా గుర్తించారు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించారు.



మృతి చెందిన విజయ్ సాయి

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెదవేగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి రైతు బలయ్యాడు. పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ సూర్యారావుపేట గ్రామానికి చెందిన బలుసు వెంకట రమణమూర్తి శనివారం ఉదయం ఏడుగంటల సమయంలో అతనికి చెందిన కొబ్బరి, కోకో తోటలో కూలీలతో పనిచేయిస్తున్నాడు. తోటలో విద్యుత్ కండక్టర్ (లైను) దిగువకు వేలా డుతూ ఉండడంతో కూలీలకు జాగ్రత్తగా పనిచేయాలని చెప్పారు. పని చేస్తున్న క్రమంలో రమణమూర్తి ప్రమాదవశాత్తు విద్యుత్ కండక్టర్‌కు తగలాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతనిని ఏలూరు ప్రభు త్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రమణమూర్తి (58) అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెదవేగి పోలీసులు కేసునమోదు చేశారు.



బలుసు వెంకట రమణమూర్తి (ఫైల్)

చికిత్స పొందుతూ కార్పెంటర్ మృతి

యలమంచిలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరగాలపల్లి గ్రామానికి చెందిన వెలివెల బ్రహ్మం (50) ఇంటిపైనుంచి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య శనివారం తెలిపారు. కార్పెంటరుగా జీవనం సాగిస్తున్న వెలివెల బ్రహ్మం ఈనెల 1వ తేదీన మేడపాడు గ్రామంలో ఇంటిపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బ్రహ్మంను కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం భీమవరంలోని ఒకప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బ్రహ్మం శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుమారుడు నిహార్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

‘తల్లికి వందనం’ రాలేదంటూ విద్యుత్ పోల్ ఎక్కి హల్‌చల్



భీమవరం క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : తన కున్న ఇద్దరు బిడ్డలకు తల్లికి వందనం డబ్బులు అకౌంట్‌లో పడలేదంటూ ఒకవ్యక్తి శనివారం సాయంత్రం హల్‌చల్ చేశాడు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం భీమవరం మెంటేవారి తోటలోని ఎల్‌అండ్‌టీ కాలనీకి చెందిన కోరుపల్లి శ్యామ్‌కు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో భాగంగా అతని అకౌంట్‌లోకి డబ్బులు పడలేదు. దీంతో మనస్థాపం చెంది శనివారం సాయంత్రం బైపాస్ రోడ్డులోని యనమదుర్రు డ్రెయిన్ వద్ద వంతెన సమీపంలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ పోల్ ఎక్కి హడావుడి చేశాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని అతనిని సముదాయించారు. తల్లికి వందనం డబ్బులు పడతాయని హామీ ఇస్తేనే కిందకు దిగుతానంటూ అరిచాడు. దీంతో చేసేదేమీ లేక అతని భార్య పిల్లలను అక్కడకు తీసుకువెళ్ళి మైక్ ద్వారా అతనిని కిందకు దిగమని కోరారు. చివరకు జిల్లా కలెక్టర్‌తో చెప్పి డబ్బులు పడేలా చేస్తామంటూ హామీ ఇవ్వడంతో కిందకు దిగి వచ్చాడు. చాలాసేపు అక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు అతనిని స్టేషన్‌కు తీసుకు వెళ్ళి కౌన్సెలింగ్ ఇచ్చినట్లుగా సమాచారం.

ప్రేమ..పెళ్లి ..దాడి

పంచాయితీకొచ్చిన గ్రామ పెద్దలపై అటాక్..

కైకలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని గ్రామా నికి తిరిగి వస్తున్న సమయంలో కొంత మంది అడ్డగించి దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కైకలూరు మండలం చటాకాయ గ్రామానికి చెందిన యువకుడు, నత్తగుల్లపాడు గ్రామానికి చెందిన యువతి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈనెల 4న ఇరువురు నెల్లూరు ప్రాంతానికి పారిపోయారు. అక్కడ తెలిసిన వారి సమక్షంలో పెళ్లి చేసుకుని అక్కడి పోలీసులను ఆశ్రయించారు. యువకుని తల్లిదండ్రులు నెల్లూరు ప్రాంతంలోనే జీవిస్తున్నారు. విషయం తెలియడంతో చటాకాయ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు ఆరుగురు నెల్లూరు వెళ్లారు. వారిరువురికి నచ్చజెప్పి ఇరు గ్రామాల పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని పోలీసులకు హామీ ఇచ్చి తీసుకువస్తున్నారు. మార్గమధ్యలో యువతికి సంబంధించిన ఐదుగురు వారితో కలిశారు.శనివారం ఉదయం ఏలూరు నుంచి కైకలూరు వస్తుండగా యువతి బంధువులు ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామంలో రెండు కార్లపై వేగంగా వచ్చి యువతీ యువకులు వస్తున్న కారును అడ్డగించారు. సుమారు 15 మంది వారిపై దాడి చేశారు. యువతిని బలవంతంగా తీసుకువెళ్లారు. దాడిలో గాయపడిన వారిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ సంఘటన తెలుసు కున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ప్రభుత్వాసుపత్రికి వచ్చి వారిని పరామర్శించారు. ఈ సమస్య కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్ ఎస్సై రాంబాబు వద్దకు తీసుకువెళ్లారు. యువతీ యువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తనకు ఇష్టం లేకపోయినా యువకుడు బలవంతంగా తీసుకువెళ్లినట్లుగా యువతి ధృవీకరించింది. దీంతో ఇరు కుటుంబాలు ఎవరి పిల్లలను తీసుకువెళ్లేందుకు పోలీసుల సమక్షంలో ఇష్టపడ్డారు. అయితే శ్రీపర్రులో జరిగిన దాడిపై అక్కడ ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ వెల్లడించారు.



గాయపడిన చటాకాయ గ్రామపెద్దలు

బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండాలి

బుట్టాయగూడెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలంతా బడుల్లోనే ఉండేలా అన్ని శాఖల అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సిబ్బంది చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి టి.బాబూరావు తెలిపారు. 'బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ నెల 4 నుంచి 18 వరకు బడికిపోతా కార్యక్రమం గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో జరుగుతుందని దీని ఉద్దేశం నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ సాధించడమేనని అన్నారు.

ఆంధ్రజ్యోతి
ఏలూరు
ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం

పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు

చింతలపూడి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మీద అసత్య ప్రచారం చేస్తున్న యూట్యూబ్ చానళ్లపై మండల, పట్టణ కూటమి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తన సొంత నిధులతో ప్రజలకు సేవ చేస్తుంటే ఆయనపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఫిర్యాదు అందించిన వారిలో తాటి అప్పారావు, సి.హెచ్.ధర్మరాజు, కె.రాజారెడ్డి, కొత్తపూడి శేషగిరిరావు, బిజెపి నాయకులు తోట వెంకట నారాయణ, మోహన్‌రావు, విజయకుమారి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు నోట్ బుక్స్ ఇవ్వాలి

పోలవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ బుక్స్ ఇవ్వాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.భూషణం డిమాండ్ చేశారు. శనివారం చేగొండపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులను కలిసి సమస్యలడిగి తెలుసుకున్నారు. 3,4,5 తరగతులకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే ఇస్తుందని నోట్ బుక్స్ ఇవ్వడం లేదన్నారు. గతంలో ఇచ్చేవారని ఇప్పుడు ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. టీచర్లు వార్డెన్ల నామమాత్రపు నియామకాల వలన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ నాల్గవ తరగతి సిబ్బంది తక్కువ ఉండడంతో పనిభారం ఎక్కువ పడుతుందని, అదనంగా వర్కర్స్‌ని నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు.

కొవ్వలి పెద్ద చెరువుపై డీపీవోకు రైతుల ఫిర్యాదు

ఏలూరు,జూలై 5(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం కొవ్వలిలోని పెద్దచెరువులో గత ఆగస్టులో ఏపీ హైకోర్టు స్టేటస్ కో-ఆర్డర్‌ను ఇచ్చిన 177 ఎకరాలకు సంబంధించిన భూముల్లో కొందరు ఉల్లంఘించి పంటలు సాగుచేస్తున్నారని అక్కడి రైతులు జిల్లా పంచాయతీఅధికారి కొడాలి అనురాధకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు పంచాయతీ చెరువైన పెద్దచెరువులో నిల్వ ఉన్న నీటిని తూముల్లోకి, ఆయకట్టుకి వదలడంతో సార్వా సాగు చేస్తున్న తమకు నష్టం వాటిల్లుతుందని, ఎంతో ఖర్చుచేసి వేసుకున్న నారుమడులు మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి చెరువు గర్భంలో సాగు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రైతులు మొరపెట్టుకున్నారు. వాస్తవంగా 304.7 ఎకరాల భూములపై హైకోర్టులో స్టే వర్తిస్తుందని, దీనిపై దృష్టిపెట్టాలన్నారు.

ఉచిత ప్రయాణం కల్పించండి

ఏలూరు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ కృష్ణా జిల్లా, రాష్ట్రస్థాయి ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సేవల కోసం లేదా కుటుంబ అవసరాల నిమిత్తం తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సాధారణ బస్సులతో పాటు సూపర్ లగ్జరీ బస్సులతో కూడా రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు, ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్ని రకాల విద్యుత్ సర్వీసులు, గృహ, వ్యవసాయ, కమర్షియల్ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ముద్దాయిలకు శిక్షపడేలా పని చేయాలి

ఏలూరు క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ముద్దాయిలకు శిక్షపడేలాగ సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కోర్టుల్లో కేసుల విచారణ వేగంగా జరగాలంటే సాక్ష్యులను సకాలంలో హాజరుపర్చాలన్నారు. నేరస్తులు శిక్ష తప్పించుకోకూడదని, బాధితులు న్యాయం పొందేలా కృషి చేయాలన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఉత్తమ విధి నిర్వహణకు ఎంపికైన కానిస్టేబుళ్లను నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో సత్కరించనున్నట్టు వెల్లడించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, కోర్టు మోనటరింగ్ సెల్ ఇన్‌చార్జి, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌లకు ముగిసిన శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 3వ తేదీ నుంచి జరుగుతున్న మహిళా సర్పంచుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిసినట్టు ఎంపీడీవో కెఆర్ఎస్.కృష్ణ ప్రసాద్ తెలిపారు. మూడ్రోజుల శిక్షణ కార్యక్రమాల్లో పది మండలాలకు చెందిన 67 మంది మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నట్టు ఎంపీడీవో తెలిపారు. శనివారం జరిగిన ముగింపు శిక్షణా కార్యక్రమంలో జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంవోటీలు శ్రీలత, కె.శ్రీనివాసరెడ్డి, ఆశా అలేఖ్య, జి.ముత్తయ్య పాల్గొన్నారు.

పట్టపగలే బంగారు నగలు చోరీ

ద్వారకాతిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో వారు ప్రవేశించి బీరువా లాకర్‌లో ఉన్న షుమారు 8 కాసుల బరువైన బంగారు నగలను తస్కరించారు. మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ ద్వారకా నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ టి.సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ద్వారకానగర్‌కు చెందిన గుండపనేని లక్ష్మి ఒంటరి మహిళ శనివారం ఉదయం 10గంటల సమయంలో ఇంటికి తాళం వేసి కూరగాయల మార్కెట్‌కు వెళ్లారు. మరో గంటకు ఇంటికి వచ్చేసరికి తాళం పగులకొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తలుపులు పగులకొట్టి ఉన్నాయి. దీంతో పరిశీలించగా అందులో ఉన్న ఎనిమిది కాసుల బంగారు నగలు చోరీ చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మాకా మున్సిపల్ హైస్కూల్లో ఏం జరుగుతోంది?

ఏలూరు అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి) : విధినిర్వహణలో ఉన్న ఓ ఉపాధ్యాయురాలిపై నేరుగా తరగతి గదిలోకి ప్రవేశించిన అల్లరిమూకలు అభ్యంతరకరంగా ప్రవర్తించడాన్ని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)జిల్లా శాఖ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటన శుక్రవారం జిల్లాకేంద్రం ఏలూరులోని మౌలానా అబుల్ కలాం అజాద్(మాకా) ఉర్దూ మీడియం మున్సిపల్ పాఠశాలలో జరిగినట్టు ఫ్యాప్టో నాయకులు వివరించారు. టీచరుపై దాడికి పాల్పడిన అసాంఘిక శక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలుసుకునేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఫ్యాప్టో సభ్యసంఘాల నాయకులురాగా, ఆమె అందుబాటులో లేకపోవడంతో సోమవారం కలుసుకుని, మాకా ఉర్దూ స్కూల్లో కొంత కాలంగా నెలకొన్న అవాంఛనీయ పరిస్థితులపై చర్చించాలని నిర్ణయించారు.

పంచాయతీల్లో చెత్త సేకరించాలి

దెందులూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని ఏలూరు జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి అన్నారు. శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడు,పోతునూరు గ్రామాల్లో చెత్త సేకరణ పనులను దెందులూరు ఎంపీడీవో కంతేటి శ్రీదేవిలతో కలిసి జిల్లా జడ్పీ సీఈవో శ్రీహరితో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం పోతునూరు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ పారిశుధ్య కార్మికులు సచివాలయ సిబ్బంది ఎంపీడీవో శ్రీదేవిలతో సీఈవో పారిశుధ్య పరిరక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

శ్రీవారి సేవలో జబర్దస్త్ ఆర్టిస్టు కార్తీక్



ద్వారకాతిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని జబర్దస్త్ ఫేం కెవ్వు కార్తీక్ శనివారం ఉదయం సందర్శించుకున్నారు. ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం పండితుల నుంచి వేదాశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా కార్తీక్‌ను గుర్తించిన ఆలయానికి వచ్చిన భక్తులు ఆయనతో ఫొటోలు దిగారు. ఆయన ఆలయంలో కాసేపు సందడి చేశారు.

ఇక ప్రభుత్వ పాఠశాలలకు.. ఉచిత విద్యుత్ !

(5వ పేజీ తరువాయి)

చెల్లింపు అంశం తెరపైకి వచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్ బిల్లుల భారం పడకుండా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలకున్న విద్యుత్ సర్వీసుల వివరాల సేకరణను దాదాపు పూర్తిచేశారు. ఈ వివరాలన్నింటినీ సేకరించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను కొన్ని పరిమితులతో ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వ తుది నిర్ణయం, మార్గదర్శకాల్లో స్పష్టత రానుంది. మొత్తంమీద ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ బిల్లులభారం లేకుండా తీసుకుంటున్న చర్యలపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే చంటి



ద్వారకాతిరుమల మండలం బుట్టాయగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



గుండుగొలనులో ప్రచారం నిర్వహిస్తున్న గన్ని



జంగారెడ్డిగూడెం 27వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఇంటింటికీ టీడీపీ సుపరిపాలన

ఏలూరుటూటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి సొంతింటి కల సాకారం చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మూడవ డివిజన్‌లో ఎమ్మెల్యే బడేటి చంటి పర్యటించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో పేదలకు 3 వేల ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. అక్టోబర్ నాటికి 9 వేల ఇళ్లను నిర్మించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే నాలుగేళ్లలో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఎన్నికల బరిలోకి వెళ్తామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, కోఆప్షన్ సభ్యులు పెదబాబు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పని చేస్తూ ప్రజాపాలన చేస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. మండలంలోని బుట్టాయగూడెం, తక్కెళ్లపాడు, సత్తాల, నారాయణపురం, వీకన్నాపురం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ఏడాది ప్రభుత్వ పాలనలో అన్ని పథకాలు ప్రజలకు చేరువయ్యాయా లేదా అంటూ ఇంటింటికి తిరుగుతూ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ తల్లికి వందనం ఎంత మంది కుటుంబంలో ఉంటే అంత మందికి అందిందా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. మండలంలోని బుట్టాయగూడెంలో వనం బాలాజీ, సత్యవతి దంపతులకి నలుగురు సంతానం కాగా అందరికీ తల్లికి వందనం అందిందని సత్యవతి చెప్పడంతో ఎమ్మెల్యే ఆ నందంలో ఉబ్బితబ్బిబ్బయ్యారు. సత్తాలలో డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉందని, హౌసింగ్ బిల్లులు రావడం లేదని ప్రజలు చెప్పడంతో తక్షణ చర్యలను ఎమ్మెల్యే తీసుకుని సమస్య తొందరలో పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

● జంగారెడ్డిగూడెం: 27వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో జరిగింది. టీడీపీ సీనియర్ నాయకులు పెనుమర్తి రామకుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేయడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. చేను ప్రసాద్, కోటగిరి ప్రమీల, చిట్టూరి బాపినీడు, కె.శ్రీదేవి, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

● భీమడోలు : గుండుగొలను గ్రామంలో ఉన్న సమస్యలపై ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆరా తీశారు. సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో గన్ని వీరాంజనేయులు పాల్గొని ఇంటింటికి తిరిగారు. సమస్యలను టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ స్వామి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి'

చింతలపూడి, జూలై 5(ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వర్గానికి ద్రోహం చేస్తున్నారని, అందుకే ఈ నెల 9న కార్మికులు సిద్ధమవుతున్నారని సీఐటీయూ నాయకులు డి.ఎన్.వి.డి. ప్రసాద్ పేర్కొన్నారు. కార్మికుల సమావేశం సీతానగరం పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గర జరిగింది. యూనియన్ నాయకులు బాల కృష్ణ, ఆర్.వి.సత్యనారాయణ, పెద్దిరాజు పాల్గొన్నారు.

● పోలవరం: దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీడీ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పోలవరం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల ముఖ్య కార్యకర్తల సమావేశం పిఎల్ఎస్ కుమారి అధ్యక్షతన జరిగింది. కారం భాస్కర్, పి భారతి, కుసుమ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మారేడుబాకలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు తేవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముత్యాలరావు, ఎస్‌కే.గౌస్, బీ.సత్యనారాయణ, వీరాస్వామి, ఎస్‌కే.మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు. జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. శనివారం చేబ్రోలులో అంగన్వాడీ, ఆటో, ఫ్యాక్టరీ వర్కర్లను కలిసి వారి నుంచి సమస్యలను స్వీకరించారు. నారపల్లి రమణారావు, సీరా అప్పారావు, సుజాత, అరుణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల కోసం పోరాడాలి

కామవరపుకోట, జూలై 5(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి పోరాడాలని వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన చింతలపూడి నియోజకవర్గం వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అధ్యక్షత వహించారు. ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడంతో ప్రజలు నిరుత్సాహంతో ఉన్నారని, వారు ప్రత్యామ్నాయంగా వైసీపీ ప్రభుత్వం కోసం నిరీక్షిస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు జెట్టి గురునాథరావు, జయప్రకాష్‌లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలకు తరలిన సీపీఐ శ్రేణులు

కుక్కునూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో శనివారం మొదలైన ఏలూరు జిల్లా సీపీఐ మహాసభలకు కుక్కునూరు మండలం నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ముందుగా కుక్కునూరు ప్రధాన రహదారిపై భారీ ప్రదర్శన నిర్వహించారు. మండల సమితి కార్యదర్శి పొన్నే లక్ష్మయ్య, ఎం.వెంకటాచారి, బాబూరావు, ఎం.రమణయ్య, పాపారావు, చోడే నగేశ్, ఎర్రయ్య, తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.



జాతీయ జెండాలను కుడుతున్న దృశ్యం

జాతీయ జెండాలు పంపిణీకి శ్రీకారం

ఏలూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సత్రం పాడుకు చెందిన షేక్ మాబూ సుభాని ఈ ఏడాది జాతీయ జెండాలు తయారు చేసి పంపిణీకి శ్రీకారం చుట్టారు. వివిధ సైజుల్లో జెండాలను కుట్టడం ప్రారంభించారు. పింగళి వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని కార్యక్రమానికి ప్రారంభించారు. 5వేల జాతీయ జెండాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

నిడమర్రు, జూలై 5(ఆంధ్రజ్యోతి) : పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలను ప్రధానో పాధ్యాయులు సత్యేంద్రనాథ్ అధ్యక్షతన అందజేశారు. బీడీఎల్ ఉద్యోగి దాత నడింపల్లి శ్రీనివాస రాజు టెన్త్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నిమ్మల పావని, నిమ్మల సత్య సాహితి, పిప్పర పవన్‌లకు 10 వేలు, 8వేలు, 6వేలు రూపాయల నగదు పోత్సాహం అందజేశారు. ఉపాధ్యాయులు మాసాబత్తుల భీమేశ్వరరావు, కొచ్చర్లపాటి సుబ్బరాజు, డి.సత్యనారాయణ, సరస్వతి, సరస్వతి కాన్వెంట్ ప్రిన్స్‌పాల్ టి.గీత పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడు అదృశ్యం

ఏలూరు క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ వైద్యుడు అదృశ్యమయ్యాడని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో శనివారం కేసు నమోదు చేశారు. ఏలూరు వంగాయిగూడానికి చెందిన నిమ్మనపూడి సురేశ్(42) అదృశ్యమవ్వడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్రి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

జీలుగుమిల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలను సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నలుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, కె.ఉపేంద్ర, ఎం.కిశోర్ ఉన్నారు.

నేటి నుంచి తొలి ఏకాదశి పూజలు

భీమడోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుండుగొలనులో ఉన్న శ్రీసీతారామస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు తొలి ఏకాదశి పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. స్వామి వారికి విశేష తులసి పూజలు, అభిషేకాలు, తులసీ దళార్చన పూజలు నిర్వహించబడునని భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని దర్శించుకోవాలని కోరారు.

ఏజన్సీలో విద్యపై నిర్లక్ష్యం తగదు..

కుక్కునూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో విద్యపై ప్రభుత్వానికి ఎందుకు చూలకనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై తహసీల్దార్ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. మండలంలో ఇంత పెద్ద సమస్య ఏర్పడిన ఎంఈవో బాబూరావు మండలం లోని పాఠశాలలను సందర్శించకపోవడం బాధకర మన్నారు. కాగా వినతిపత్రం ఇచ్చిన వారిలో లక్ష్మణ్, వరుణ్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

అక్రమంగా తిన్న ప్రతి రూపాయినీ రాబడతాం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూలై 5(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల పేరుతో వైసీపీ నాయకులు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని బొక్కేశారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అక్రమ మార్గంలో తిన్న ప్రతి రూపాయిని సక్రమ రీతిలో కక్కిస్తామన్నారు. పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రభాకర్ మండలంలో జరుగుతున్న పనుల తీరుతెన్నులపై సమీక్షించారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం భూమిని సేకరించి, పట్టాలిచ్చిందన్నారు. ఉన్న ధరకు నాలుగింతలు ధర చూపించి, భూ యజమానుల దగ్గర కమిషన్ల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని బొక్కేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదవేగి ఎస్టీ కాలనీలో విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసమంటూ మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు తినేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుకు ఆయన జడ్పీ సీఈవోకు సూచించారు. అనంతరం పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి, మరుగు దొడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. సిద్ధమవుతున్న పెదవేగి సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు మేడికొండ ఉమాదేవి, బొబ్బూరి నాగేశ్వరరావు, ఎంపీడీవో పి.శ్రీనివాస్, తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా విద్యార్థినుల సంఘ నాయకుల ప్రమాణస్వీకారం

ఏలూరు అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినుల సంఘం 2025-26 విద్యాసంవత్సరానికి నూతనంగా ఎన్నికైన నాయకుల ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరిగింది. కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సెయింట్ థెరిస్సా విద్యాసంస్థల సుపీరియర్, మదర్ అగ్నెస్టైన్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ మహిళా సాధికరత కోసం ఏడు దశాబ్దాలుగా కళాశాల చేస్తున్న కృషిని వివరించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థినులు విద్యారంగంలో రాణించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం ఇంటర్ క్యాంపస్ విద్యార్థినుల సంఘానికి ఎన్నికైన ప్రెసిడెంట్ ఎం.దుర్గాభవాని, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సమీర, సెక్రటరీ ఎం.విన్నీ, జాయింట్ సెక్రటరీ షేక్ రిజ్వానా, ట్రెజరర్ పి.పూజశ్రీ, లీడర్ డిసిప్లిన్ బి.జాహ్నవిలతో ప్రమాణస్వీకారం చేయించారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థి సంఘ నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, సిస్టర్ మరియట్టా డిమెల్లో, సిస్టర్ లూర్దుమేరి, సిస్టర్ మరియట్టా పూదోట, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన విద్యార్థి సంఘ నాయకులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రామచంద్ర కళాశాలకు బంగారు పతకాలు

పెదపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విద్యాలయం రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల 11వ స్నాతకోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని జయంతి విశాల సుబ్బలక్ష్మి బంగారు పతకాన్ని అందుకున్నట్టు కళాశాల ఎండీ కె.సాయి రోహిత్ తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విద్యాలయం అనుబంధంగా ఉన్న 157 కళాశాలలు, విభాగాల్లో ఉత్తమ విద్యార్థినిగా కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఈ పతకాన్ని అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 9.08 సీజీపీఏతో ప్రథమస్థానంలో నిలవడంతో, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్‌లో పేనిక ఆదిత్య 8.71 సీజీపీఏతో ప్రథమ స్థానంలో బంగారు పతకాలను అందుకున్నారు. వీరికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాలను అందజేశారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మురళీధరరావు అభినందించారు.

నిత్యావసరాలు అందజేత

ఏలూరు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి):ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు ఎల్ కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా లయన్స్ జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరావు ఆర్థిక సహకారంతో శనివారం ఏలూరు పోణంగి రోడ్‌లో ఉన్న రవితేజ రిలీఫ్ సెంటర్‌కు నిత్యావసరాలను అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఎ.లావణ్య అధ్యక్షతన జరిగిన ఈసేవా కార్యక్రమంలో ముఖ్య అతిథి, లయన్స్ జిల్లా మొదటి ఉపగవర్నర్ డి.సుబ్బారావు మాట్లాడుతూ పేద యువతకు, మహిళలకు, వృద్ధులకు అనేక రూపాల్లో సేవలందిస్తున్నామన్నారు. ఎల్‌సీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎల్‌విఆర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రవితేజ గృహంలో మెడికల్ క్యాంపులు, అవసరమైన సహాయం అందిస్తామన్నారు.



గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న కార్యవర్గ సభ్యులు

భారీ వాహనాలకు చెక్

ఉంగుటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): నారాయణపురం వంతెనకు రంధ్రం పడటంతో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా చేబ్రోలు పోలీసు స్టేషన్ నుంచి కాల్వ గట్టు వెంబడి వాహనాల రాకపోకలకు అనుమతించారు. అయితే గ్రామంలో ఉన్న తాగునీటి వనరుల పైపులైను ఇదే దారిలో ఉండడం భారీ వాహనాలు నిత్యం వెళ్తుండటంతో పైపు లైన్ పగిలి ప్రజలకు తాగు, సాగు నీటి సమస్య ఉత్ప న్నమవుతోంది. దీంతో శనివారం పాలకవర్గం అధ్యక్షురాలు దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో వార్డు సభ్యులు గ్రామస్థులు కలిసి పంచాయతీ సిబ్బందితో కలిసి పైపు లైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. భారీ వాహనాలు రాకుండా తేలిక పాటి వాహనాలు వెళ్లేలా గడ్డర్లు ఏర్పాటు చేశారు.



హోమం నిర్వహిస్తున్న పండితులు

నేత్రపర్వంగా సుదర్శన హోమం

ద్వారకాతిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం విశేష కార్యక్రమాలు జరిగాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్త దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో పుణ్యాహ వచనం, కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ సుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. ఆ తరువాత మూల విరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు.

నేడు సంగీత నీరాజనం

ఏలూరు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్వాతి తిరునాళ్ మహరాజు, హరికేశ నల్లూర్ ముత్తయ్య భగవతార్‌లను స్మరించుకుంటూ ఆదివారం లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో సంగీత నీరాజనం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పీవీ ఆర్కే. శాస్త్రి, సావిత్ర ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత కళాకారులు, అభిమానులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కువైట్‌లో ఉద్యోగ అవకాశాలు

ఏలూరుకార్పొరేషన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మన్పవర్ కంపెనీ ఏపీ వారి భాగస్వామ్యంతో కువైట్‌లో నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాల కోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాన్ని ప్రారంభించినట్టు ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ శనివారం తెలిపారు. రాష్ట్రానికి చెందిన అనుభవజ్ఞులైన నిర్మాణ కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, సీలింగ్ వర్క్సులలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఐటీఐ డిప్లమా కలిగి ఉండి 3-4 సంవత్సరాల అనుభవం ఉన్న 25-50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని మనోహర్ వివరించారు.

సిబ్బందికి వేతనాలు పెంచాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ శనివారం ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, ఉద్యోగ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నాయకులు ఎ. అప్పలరాజు, బి.నారాయణరావు, ఎస్.ఎం.వి. సుబ్బారావు, కె.వి.రామయ్య, ఏలియా పాల్గొన్నారు.

నేడు ర్యాబిస్ వ్యాధి టీకాలు

జంగారెడ్డిగూడెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక పశువైద్యశాలలో రాబిస్ వ్యాధి టీకాలు వేయనున్నట్టు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పి.ఎస్.వి.శేఖర్ దొర శనివారం తెలిపారు. పెంపుడు కుక్కలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

వనమహోత్సవం

జంగారెడ్డిగూడెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పొగాకు-32 బోర్డు వేలం అధికారి జె.సురేంద్ర కుమార్ అన్నారు. పొగాకు బోర్డు స్వర్ణోత్సవాల్లో భాగంగా మండలంలోని తాడువాయిలో పొగాకు బోర్డు వేలం అధికారి జె. సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. మొక్కలు నాటడంతో పాటు రైతులకు 300 మొక్కలు పంపిణీ చేశారు. టుబాకో బోర్డు ఎస్‌జీవో వై.ప్రశాంత్, రైతు సంఘ నాయకులు సత్రం వెంకట్రావు, పొన్నగంటి అనిల్, కొడవటి సత్తిరాజు, బండారు సుబ్బారావు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద సందడి

బుట్టాయగూడెం, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీ గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద అమ్మవారి శిరస్సు పైనుంచి జాలువారుతున్న జలపాతంలో భక్తులు స్నానాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. శనివారం అమ్మవారి ఆలయానికి మొక్కులు తీర్చుకోడానికి వస్తున్న భక్తులకు ఆలయం వద్ద ఉన్న జలపాతం కనువిందు చేస్తోంది. అటవీ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున అమ్మవారి ఆలయం వద్ద ఉన్న జలపాతం ఉధృతంతా వస్తుంది. దీంతో భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

దివ్యాంగులకు రూ.10,116 అందజేత

జీలుగుమిల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అనాథ, దివ్యాంగులను పోషిస్తున్న జంగారెడ్డిగూడెం సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థకు కామయ్యపాలెం టీడీపీ గ్రామాధ్యక్షులు శీమకుర్తి శ్రీనివాస్ నగదు సాయంగా అందజేశారు. శనివారం సంస్థ ప్రతినిధికి రూ.10,116 నగదు అందజేసినట్లు తెలిపారు. గిరిజన నాయకులు కట్టా నాగేశ్వరావు, బోడిక భీమరాజు ఉన్నారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ విద్యార్థులకు సూచన

ఏలూరు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలపై రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబుపత్రాలను ఆయా పాఠశాలల లాగిన్‌లకు పంపినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జవాబు పత్రాలను ప్రింట్ తీసి అందజేయాలన్నారు.

ముదినేపల్లి ఇన్‌చార్జ్ ఎంఈవో-1గా రామారావు

ముదినేపల్లి, జులై 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఇన్‌చార్జ్ ఎంఈవో-1గా కైకలూరు ఎంఈవో-1 డి.రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు డీఈవో వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పూర్తి అదనపు బాధ్యతలు కలిగిన ఎంఈవో-1గా వ్యవహరిస్తారన్నారు. గత నెలాకరున ముదినేపల్లి ఎంఈవో-1గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నూజివీడు ఎంఈవో-1 సేవ్యా నాయక్ రిటైర్ కావటంతో రామారావును నియమించారు.

ప్రిస్కూల్‌పై తల్లులకు అవగాహన

మునునూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త పల్లిపాము రాజకుమారి తల్లులు తమ పిల్లలను క్రమం తప్పకుండా ప్రి స్కూల్‌కు పంపాలన్నారు. పిల్లలకు బొమ్మలతో ఆటపాటలతో విద్య నేర్పించే విధానాలు, పిల్లల శారీరక అభివృద్ధిపై తల్లులకు రాజకుమారి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ట్రిపుల్ ఐటీ తొలి దశ అడ్మిషన్లు పూర్తి

నూజివీడు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో తొలి దశ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. జూన్ 30 నుంచి ప్రారంభమైన అడ్మిషన్లలో జూన్ 30, జూలై 1వ తేదీన ఆర్కే వ్యాలీ, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించగా ఈ నెల 2, 3 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు, శుక్ర, శనివారాల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. శనివారం నాటి కౌన్సెలింగ్‌ను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్, ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్ పటేల్ పర్యవేక్షించారు. చివరి రోజు మొత్తం 555 మంది మెరిట్ విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 430 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ రిజిస్టర్ అయ్యారు. వీరిలో 397 మంది ప్రవేశాలు పొందగా బాలురు 126 మంది, బాలికలు 271 మంది ప్రవేశాలు పొందారు.

ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు చర్యలు : ఈడీ



నూజివీడు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అందుకు కార్మికులు, ఉద్యోగులు సహకరించాలని ఆర్టీసీ ఈడీ టి. చంగల్‌రెడ్డి అన్నారు. నూజివీడు ఆర్టీసీ బస్ డిపోను శనివారం ఆయన సందర్శించి మాట్లాడుతూ త్వరలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తున్న దృష్ట్యా వారి సౌకర్యార్థం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కార్మికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎం పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పందులను గ్రామానికి దూరంగా ఉంచండి

పెంపకందారులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జులై 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో పందుల పెంపకందార్లకు పంచాయతీ కార్యదర్శి గిరిజ శనివారం నోటీసులు జారీ చేశారు. 'అల్లూరులో పందుల బెడద' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించి జిల్లా పంచాయతీ అధికారి సమస్యపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీవో జారీ చేసిన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి పందుల పెంపకం దార్లకు నోటీసులు అందజేసి గ్రామానికి దూరంగా పందులను పెంచుకోవాలని సూచించారు. గ్రామంలో పందులు సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

చాట్రాయి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపూరు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం అమలును శనివారం ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తనిఖీ చేశారు. సన్న బియ్యం వచ్చిన తరువాత భోజనం రుచి ఎలా ఉన్నదని ఎంఈవో ప్రశ్నించగా విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ సన్న బియ్యం వచ్చిన తరువాత మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. హెచ్‌ఎం జి. సౌభాగ్యం పాల్గొన్నారు.

పొలాల్లో ముంపు నివారణ చర్యలు

కైకలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటపొలాల్లో నీరు నిల్వ ఉండడంతో రైతులు వెదజల్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తామరకొల్లు సాగునీటి సంఘాల అధ్యక్షుడు గంగుల ఏసురాజు అన్నారు. శనివారం కైకలూరు మండలం తామరకొల్లులో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో ఎక్స్‌కవేటర్లతో ముంపు నివారణ పనులను చేపట్టారు. తామరకొల్లులోని రెండో బ్రాంచ్ పంట కాలువ, డ్రెయిన్ తవ్వకం పనులను నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్ యలవర్తి సతీష్, సాగునీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడు రఘుబాబుకు సన్మానం



మునునూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల నూతన అధ్యక్షుడు గద్దె రఘుబాబును శనివారం మునునూరులో అధికారులు, టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బీఏ సత్య నారాయణ, ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు, పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్, ఏపీఎం రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్‌తోపాటు నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నక్కా యోహాను తదితరులు రఘుబాబును సన్మానించారు. మండల అభివృద్ధిలో అధికారులకు సహకరించడంతోపాటు కార్యకర్తలు, నాయకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రఘుబాబు స్పష్టం చేశారు.



టీడీపీ నాయకుడు దుర్గాకు పరామర్శ

చాట్రాయి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల పాముకాటుకు గురై కోలుకున్న నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కట్టా నాగ దుర్గారావు(దుర్గా)ను శనివారం కూటమి నాయకులు పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, నాయకులు చిమటబోయన పుల్లారావు, గార్లపాటి మారేష్, తేళ్ళూరి శేఖర్, పరసా శ్రీను, ఉయ్యాల దిలీప్, తుమ్మల జగన్, ముత్తయ్య తదితరులు పరామర్శించారు.

9న సమ్మె విజయవంతం చేయాలి


సమ్మె పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మండవల్లి జూలై 5(ఆంధ్ర జ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు విజయలక్ష్మి కోరారు. మండవల్లిలో శనివారం అంగన్వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ అంగన్వాడీల జీతాల పెంపు, పని గంటలు ఇతర సమస్యలు పరిష్కారం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సమ్మె నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్ని వర్గాలు మద్దతు తెలిపాలని కోరారు. పోస్టర్లను ఆవిష్కరించారు. అంగన్వాడీ నాయకులు చెల్లమ్మ, ఉమాదేవి, లక్ష్మీ, శివపార్వతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ముదినేపల్లి, జులై 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎస్‌ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.లెనిన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు అరుణ కుమారి, నాయకులు పాల్గొన్నారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


తల్లిదండ్రులను ఒప్పించి రాజస్థానీ విద్యార్థినిని ఉర్దూ పాఠశాలలో చేర్పించిన ఎంఈవో(ఫైల్)

విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల వేట

- ముదినేపల్లి మండలంలో 5 పాఠశాలల్లో అడ్మిషన్లు నిల్
- నమోదు పెంపునకు యత్నాలు

ముదినేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అధికార్లు, ఉపాధ్యాయులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ నెల 10లోగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలన్న అధికార్ల ఆదేశాలతో ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం జల్లెడ పడుతున్నారు. మండలంలోని 12 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఎంఈవో నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రయత్నించగా ఏడు పాఠశాలల్లో అతి కష్టం మీద కొద్ది మంది విద్యార్థులను చేర్పించగలిగారు. మరో అయిదు పాఠశాలల్లో చేర్పించేందుకు ఒక్క విద్యార్థి కూడా లభించలేదు. మండలంలో అయిదుగురు, అంతకంటే లోపు విద్యార్థులున్న ఊటుకూరు, ప్రొద్దుటూరు, తేరగూడెం, సీతారామపురం, వడాలి-1 ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థులు కరువయ్యారు. దీంతో ఈ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 295 మంది పిల్లలు ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరాల్సి ఉండగా 196 మందే చేరారు. మిగిలిన వారు ప్రైవేటు స్కూళ్లలో చేరారు. ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్న ప్రొద్దుటూరు, సీతారామపురం, తేరగూడెం, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు మండల విద్యాశాఖ అధికార్లు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు తమ వేటను ముమ్మరం చేశారు.

రీ సర్వేలో సింగిల్ ఎల్పీ నంబర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

కైకలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రీ-సర్వేలో జాయింట్ ఎల్పీ నంబర్లు వచ్చిన రైతులంతా సింగిల్ ఎల్పీ నంబర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నుంచి సింగిల్ ఎల్పీ నెంబరు ఉన్న రైతులందరికీ ప్రభుత్వమే పాసు పుస్తకాలను ఉచితంగా ఇస్తుందన్నారు. అందువల్ల జాయింట్ ఎల్పీ నెంబరు ఉన్న రైతులు సబ్ డివిజన్ కోసం గ్రామ సచివాలయాల్లో, మీసేవా కేంద్రాల్లో అర్జీ పెట్టుకోవాలన్నారు. జాయింట్ ఎల్పీ నంబర్లో ఉన్న రైతులంతా ఒకే అర్జీ పెట్టుకుంటే సరిపోతుందన్నారు. రైతులు అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కలిదిండి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన ఈ నెల 7న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సర్టిఫికెట్ల అందజేత

ఆగిరిపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి హోమియో వైద్యశాలలో ఇటీవల యోగాంధ్రాలో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు, క్యాష్ రివార్డులను శనివారం తహసీల్దార్ ప్రసాద్ అందజేశారు. అనంతరం యోగా గురువు టీవీ కుమార్, ట్రైనర్ సాంబశివరావు దంపతులను తహసీల్దార్‌ను సత్కరించినారు. డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్‌బాబు, సర్పంచ్ లక్ష్మీ విక్టర్‌బాబు, యోగా టీచర్ కుమార్, హోమియో డాక్టర్ డి. రజిత, హోమియో అభివృద్ధి కమిటీ మెంబర్ వై. ప్రణీత్, శోభనాపురం హెచ్‌ఎం యామిని పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

మునునూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెం పంచాయతీలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. గ్రామంలో అన్ని కాలనీల్లో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మట్టి, మురుగును పారిశుధ్య సిబ్బందితో తొలగింపు ప్రక్రియను సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు. సోమవారం నుంచి గ్రామంలో దోమల నివారణ మందును పిచికారి చేయిస్తామన్నారు. పనులను కార్యదర్శి విద్యాధరరావు పర్యవేక్షిస్తున్నారు.

పీఈ సెట్‌లో స్రవంతి ప్రతిభ



కలిదిండి, జూలై 5 (ఆంధ్ర జ్యోతి): ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రవేశ పరీక్షలో కలిదిండికి చెందిన గరికిముక్కు స్రవంతి ప్రతిభ చూపింది. ఇటీవల విడుదల చేసిన పీఈ సెట్ ఫలితాల్లో 160వ ర్యాంకు సాధించింది. కైకలూరు వైవీఎన్నాఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ విభాగంలో విద్యనభ్యసించిన స్రవంతి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పలు టోర్నీలో రాణించింది. ఈ సందర్భంగా కలిదిండి సర్పంచ్ ప్రసన్న, కళాశాల అధ్యాపకులు, గ్రామస్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.



ఆర్టీసీ కార్మికుల గేట్ మీటింగ్

నూజివీడు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్టీసీ డిపో వద్ద శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు గేట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. రీజియన్ నాయకులు రంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, గత ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ప్రయోజనాలను సైతం పక్కకు పెట్టి తమకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వమైనా కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిపో అధ్యక్షుడు ఎం. చిరంజీవి, కార్యదర్శి కుమార్, గ్యారేజ్, ట్రాఫిక్ కార్మికులు పాల్గొన్నారు.

ఇక ప్రభుత్వ పాఠశాలలకు.. ఉచిత విద్యుత్ !

(5వ పేజీ తరువాయి)

చెల్లింపు అంశం తెరపైకి వచ్చింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్ బిల్లుల భారం పడకుండా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలకున్న విద్యుత్ సర్వీసుల వివరాల సేకరణను దాదాపు పూర్తిచేశారు. ఈ వివరాలన్నింటినీ సేకరించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను కొన్ని పరిమితులతో ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వ తుది నిర్ణయం, మార్గదర్శకాల్లో స్పష్టత రానుంది. మొత్తంమీద ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ బిల్లుల భారం లేకుండా తీసుకుంటున్న చర్యలపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.


కైకలూరులో కరపత్రాల పంపిణీ


చినపాలపర్రులో టీడీపీ నాయకుల ప్రచారం

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షం : కమ్మిలి

కైకలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శనివారం కైకలూరులోని 127, 128వ బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం నెరవేరుస్తున్నారని సూపర్-6 పథకాలను పూర్తి స్థాయిలో అమలుచేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటారన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షు డు కేకే బాబు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్, యూనిట్ కో-ఇన్‌చార్జి వేగిరెడ్డి సురేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వాసు పాల్గొన్నారు.

ముదినేపల్లి: చినపాలపర్రులో శనివారం టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సూపర్ సిక్స్ పథ కాల హామీల అమలుపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవి కుమార్, నాయకులు ఎలిశెట్టి లక్ష్మయ్య, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు రౌతు మాధవి తదితరులు పాల్గొన్నారు.





కైకలూరు, నూజివీడు లోక్ అదాలత్‌లలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు వీవీఎన్‌వీ లక్ష్మి, నాగశైలజ

లోక్ అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం

కైకలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసులు రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్టేనని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. శనివారం కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించి మొత్తం 881 కేసులను రాజీ చేశారు. సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు వీవీఎన్‌వీ లక్ష్మి, ఎం. శివకిరణ్ కేసులను పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, న్యాయవాదులు మాడెం సత్యనారాయణ, పి. పవన్‌కాంత్, అడగర్ల రాంబాబు, కందుల రమాపార్వతి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: శనివారం నూజివీడు కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదకాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. 918 కేసులను పరిష్కరించి రూ. రెండు కోట్ల రెండు లక్షల 72 వేలును బాధితులకు అందించారు.

మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గాభవాని

మునునూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాజకీయాలకతీతంగా పాలకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా అన్నారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఆలస్యంగా ప్రారంభించడంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు సమయపాలన పాటించాలని లేకుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అనంతరం ఏవో చాముండేశ్వరి, ఎంఈవో సుబ్బారావు, తహసీల్దార్ కేవీ రమణ, ఏపీఎం రాంబాబు తమ శాఖల పనితీరును వివరించారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా విచ్చేసిన టీడీపీ మండల నూతన అధ్యక్షుడు గద్దె రఘుబాబు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే అజెండాగా కూటమి పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నేరవేర్చేలా సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంతోపాటు గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, ఎంపీడీవో బీఏ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ-2 పాముల గంగాధరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

ఆగిరిపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సిబ్బంది సేకరించాలని డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్‌బాబు ఆదేశించారు. అమ్మవారిగూడెం గ్రామంలో శనివారం ఇంటింటి చెత్త సేకరణలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అన్ని గ్రామాలలో ఆయా పంచాయితీ కార్యదర్శులు, పంచాయితీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్ళి చెత్తను సేకరించాలని సూచించారు. అమ్మవారిగూడెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు వెళ్ళి వర్మీ కంపోస్టును పరిశీలించారు. అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంక్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ పరిశీలించారు.

వృద్ధుడి అదృశ్యం


మారగాని సరస్వతీ రావు

ముదినేపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వడాలి గ్రామానికి చెందిన మారగాని సరస్వతీ రావు (67) అనే వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గత నెల 17వ తేదీ ఉదయం నిద్రలేచి ఇంటి నుంచి వెళ్ళిపోయిన వృద్ధుడి ఆచూకీ తెలియక పోవడంతో శనివారం అతని కుమారుడు నరేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ..పెళ్లి ..దాడి

పంచాయితీకొచ్చిన గ్రామ పెద్దలపై అటాక్


గాయపడిన చటాకాయ గ్రామపెద్దలు

కైకలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని గ్రామానికి తిరిగివస్తున్న సమయంలో కొంత మంది అడ్డగించి దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కైకలూరు మండలం చటాకాయ గ్రామానికి చెందిన యువకుడు, నత్తగుల్లపాడు గ్రామానికి చెందిన యువతి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 4న ఇరువురు నెల్లూరు ప్రాంతానికి పారిపోయారు. అక్కడ తెలిసిన వారి సమక్షంలో పెళ్లి చేసుకుని అక్కడి పోలీసులను ఆశ్రయించారు. యువకుని తల్లిదండ్రులు నెల్లూరు ప్రాంతంలోనే జీవిస్తున్నారు. విషయం తెలియడంతో చటాకాయ గ్రామానికి చెందిన గ్రామపెద్దలు ఆరుగురు నెల్లూరు వెళ్లారు. వారిరువురికి నచ్చజెప్పి ఇరుగ్రామాల పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని పోలీసులకు హామీ ఇచ్చి తీసుకువస్తున్నారు. మార్గమధ్యంలో యువతికి సంబంధించిన ఐదుగురు వారితో కలిశారు.శనివారం ఉదయం ఏలూరు నుంచి కైకలూరు వస్తుండగా యువతి బంధువులు ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రు గ్రామంలో రెండు కార్లపై వేగంగా వచ్చి యువతీయువకులు వస్తున్న కారును అడ్డగించారు. సుమారు 15 మంది వారిపై దాడి చేశారు. యువతిని బలవంతంగా తీసుకువెళ్లారు. దాడిలో గాయపడిన వారిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఈ సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ప్రభుత్వాసుపత్రికి వచ్చి వారిని పరామర్శించారు. ఈ సమస్య కైకలూరు రూరల్ సీఐ రవి కుమార్, ఎస్సై రాంబాబు వద్దకు తీసుకు వెళ్లారు. యువతీయువకుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తనకు ఇష్టం లేకపోయినా యువకుడు బలవంతంగా తీసుకు వెళ్లినట్లుగా యువతి ధ్రువీకరించింది. దీంతో ఇరు కుటుంబాలు ఎవరి పిల్లలను వారు తీసుకు వెళ్లేందుకు పోలీసుల సమక్షంలో ఇష్టపడ్డారు. అయి తే శ్రీపర్రులో జరిగిన దాడిపై అక్కడ ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ వెల్లడించారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా జగన్నాథ రథయాత్ర


రథంలో జగన్నాథుడు

నూజివీడు, జూలై 5 (ఆంధ్ర జ్యోతి): జగన్నాథుని రథయాత్ర నూజివీడులో వైభవోపేతంగా సాగింది. నూజివీడు నియోజకర్గం నెక్కలం గొల్లగూడెం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంటేశ్వరస్వామి దేవస్థానం, ఇస్కాన్ టెంపుల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రథయాత్రను నిర్వహించగా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. పూరీ జగన్నాథ రథయాత్రను తలపిస్తూ భక్తులు రథాన్ని లాగుతూ ముందుకు సాగగా భక్తులు కోలాట నృత్యాలు నిర్వహించగా రథ యాత్ర సాగే మార్గం మొత్తాన్ని భక్తులు రంగవల్లులతో తీర్చిదిద్దారు. కార్యక్రమాన్ని నూజివీడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు. అనంతరం నూజివీడు డీఎన్నార్ కళాశాల ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరిగింది.



రామలింగేశ్వర స్వామికి సారె

కైకలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారికి శనివారం గ్రామానికి చెందిన ఉప్పులూరు రాజశేఖర్ దంపతులు, ఉప్పులూరు ముత్తంరాజు శర్మ దంపతులు ఆధ్వర్యంలో ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అందజేశారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ఆగిరిపల్లి, జూలై 5(ఆంధ్ర జ్యోతి): ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఈవో సాయి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు, అనంత రామకృష్ణల నేతృత్వంలో స్వామి, అమ్మవార్లను పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎగువ సన్నిధిలో స్వామి వారికి అభిషేకములు జరుగగా దిగువ సన్నిధిలో ఆగిరిపల్లికి చెందిన ఎం. అచ్యుతరామయ్య దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

బాబా ఆలయ వార్షికోత్సవం



ఆగిరిపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సింగన్నగూడెం బస్టాప్ వద్ద గల సర్వకార్యసిద్ధి శ్రీషిరిడి సాయిబాబా మందిరం 18వ వార్షికోత్సవం సందర్భంగా బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మంగళ హారతులు నిర్వహించారు. బాబా ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఆగిరిపల్లి తహసీల్దార్ ప్రసాద్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాకాంబరిగా విజయ దుర్గాదేవి



ముదినేపల్లి, జులై 5 (ఆంధ్ర జ్యోతి): దేవపూడి విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి భక్తులు పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు చావలి సత్య సాయి బాబా శర్మ దంపతులు అమ్మవారిని శాకాంబరిగా అలంకరించగా కూరగాయలను మల్లపరాజుగూడేనికి చెందిన బత్తుల గంగరాజు దంపతులు బహూకరించారు. ఆలయ నిర్వాహకుడు దాసరి భగవాన్ దాస్ పర్యవేక్షణలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.